నిత్యావసరాల ధరలపై 6న ఆందోళన : సీపీఐ

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 3 : నిత్యావసరాల ధరలు తగ్గించాలని కోరుతూ ఈ నెల 6వ తేదీన దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య వెల్లడించారు. మంగళవారం నెల్లూరులోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిత్యావసరాలు, పెట్రో ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠపరచాలని ఈ ఆందోళన చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం గాంధీబొమ్మ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి, అక్కడ ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆందోళన పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు మాల కొండయ్య, సయ్యద్ సిరాజ్, నందిపోగు రమణయ్య, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

అది చాలయ్యా.. మాకు!

వారంతా కుమ్మరులు. పెద్దలతరం నుంచి కుండలు చేయడమే వృత్తి. సిల్వర్, స్టీల్, రాగి పాత్రలు మార్కెట్‌లోకి రావడంతో కుండలకు ప్రాధాన్యం తగ్గింది. ఇంకేముంది.. తరాలనాటి వృత్తి గిట్టుబాటు కాదని ప్రత్యామ్నాయం వైపు అడుగులేశారు. ఎంత దూరం వెళ్లినా.. ఏ వృత్తిలో ఉన్నా 'చవితి'నాడు మాత్రం సొంతూరిలో వాలిపోతారు. పండక్కి నెల రోజుల ముందు నుంచే వినాయక ప్రతిమలు తయారు చేసి, జిల్లా నలుమూలలకు తరలించి విక్రయిస్తారు. 'గిట్టుబాటు కాకున్నా మా చేతుల్లో ప్రాణం పోసుకున్న బొమ్మలు కొన్ని వందల ఇళ్లలో పూజలందుకుంటున్నాయ్. అది చాలయ్య మాకు' అంటున్నారు వెంగారెడ్డిపాళెంలోని పర్యావరణహితులు.

- సంగం

ప్రతి ఇంటా మా వినాయకులు ఎంతో సంతృప్తి!



సంక్రాంతి పండుగ వస్తే పల్లెల్లో ఎంత సందడిగా ఉంటుందో వినాయక చవితి వచ్చిందంటే మా గ్రామంలో కూడా అంతే సందడిగా ఉంటుంది. బొమ్మలను తయారు చేయించుకోవడానికి ఎక్కడెక్కడ నుంచో వెతుక్కుంటూ వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల రాకతో మా గ్రామం నిండుగా ఉంటుంది. మా చేతుల్లో రూపుదిద్దుకున్న మట్టి గణపతులు వందల ఇళ్లలో కొలువై పూజింపబడుతున్నాయని ఎంతో సంతృప్తినిస్తుంది. దీంతోనే పెద్దగా ఆదాయం లేకపోయినా కూలి గిట్టుబాటుకే తయారు చేసి ఇస్తున్నాం.

- వెంకట రమణయ్య, తయారీదారుడు

ప్రోత్సహిస్తే మరిన్ని చేస్తాం



కొన్నేళ్లుగా మట్టి గణపతులను తయారుచేసి విక్రయిస్తున్నాం. మా గ్రామం నుంచి 25వేల నుంచి 30 వేల ప్రతిమలను జిల్లా నలుమూలలకు తరలిస్తున్నాం. ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం అందిస్తే మరిన్ని ప్రతిమలను ఉత్పత్తి చేసి సరఫరా చేస్తాం.

- మన్నేపల్లి శ్రీనయ్య, వెంగారెడ్డిపాళెం





- మా చేతుల్లో ప్రాణం పోసుకున్న ప్రతిమలు ప్రతి ఇంటా పూజలందుకుంటున్నాయ్!
- ఆదాయం లేకున్నా.. సంప్రదాయం కొనసాగింపు
- ఏటా 35వేలకుపైగా ప్రతిమల తయారీ
- పర్యావరణహితులు.. వెంగారెడ్డిపాళెం కుమ్మరులు

సంగం మండలంలోని వెంగారెడ్డిపాళెం ఓ కుగ్రామం. ఒకప్పుడు 25 కుటుంబాలకుపైగా కుమ్మర్లు ఉండేవారు. కులవృత్తి గిట్టుబాటు కాకపోవడంతో ఆ వృత్తిని నమ్ముకుని ఉన్నది రెండు కుటుంబాలే. మిగిలినవారు వ్యవసాయ, దినసరి కూలీలుగా మారిపోయారు. డిమాండు, గిట్టుబాటుకాక ఎప్పుడో కులవృత్తిని వదిలేసినా, ఆదాయం లేకున్నా తరతరాలుగా మట్టి గణపతులు తయారు చేస్తూ గ్రామం లో పది కుటుంబాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

● నెల రోజుల ముందే హడావుడి

ప్రతి ఏడాది వినాయక చవితికి నెల ముందు నుంచే ఆ పది కుటుంబాలు మట్టి వినాయక ప్రతిమల తయారీలో నిమగ్నమవుతాయి. స్థానికంగా మట్టి లభించకపోయినా దూరప్రాంతం నుంచి తెచ్చుకుని బొమ్మల తయారీకి అనువుగా మట్టిని సిద్ధం చేసుకుంటారు. అర అడుగు నుంచి ఒకటిన్నర అడుగు ఎత్తున వివిధ ఆకారాల్లో ప్రతిమలను తయారు చేస్తారు. మొదట్లో చేతులతోనే మట్టి గణపతులను తయారు చేసేవారు. ఇప్పుడు అచ్చుల ఆధారంగా మట్టి గణపతులను రూపొందిస్తున్నారు. అలా తయారు చేసిన వాటిని వారం రోజులపాటు నీడలో ఆరబెట్టి సహజమైన రంగులతో సుందరంగా తీర్చిదిద్దుతారు. ఒక్కో ప్రతిమను రూ.20 నుంచి 70లకు విక్రయిస్తారు. హోల్‌సేల్ వ్యాపారులకు ఈ ధరలో తగ్గింపు ఉంటుంది. ముందుగా ఆర్డర్ ఇస్తే 10 అడుగుల భారీ మట్టి విగ్రహాలను తయారు చేయగల నైపుణ్యం కలిగిన కళాకారులు ఈ గ్రామంలో ఉన్నారు. కానీ ధర ఎక్కువ కావడంతో ఎవరూ ముందుకు రావడం లేదు.

● జిల్లా నలుమూలలకు తరలింపు



గ్రామంలో రూపుదిద్దుకున్న గణనాథులను 'చవితి'కి ముందుగానే నెల్లూరు, బుచ్చిరెడ్డిపాళెం, కావలి, కోవూరు, ఆత్మకూరు ప్రాంతాలకు తరలించి విక్రయిస్తారు. కొంతమంది వ్యాపారులు గ్రామానికే వచ్చి హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తుంటారు. అలాగే గ్రామస్థులే ఆయా ప్రాంతాలకు వెళ్లి ప్రజలకే విక్రయిస్తుంటారు. అయితే, ఖర్చులు పెరుగుతుండటంతో గిట్టుబాటు కావడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చిన ఆదాయంతోనే సంతృప్తి పొందుతూ తమ తాతలనాటి సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్లు వారు చెబుతున్నారు.



అమ్మకానికి వినాయక ప్రతిమలు సిద్ధం

ఇలాగైతే ముప్పే!

- నత్తనడక 'సోమశిల' అప్రాన్ పనులు
- సీఎం చంద్రబాబు ఆదేశాలు బేఖాతరు



సోమశిల ప్రాజెక్టు ముందు 11, 12 క్రస్ట్‌గేట్ల నుంచి నీరు సరఫరా చేసే డైవర్షన్ కెనాల్ ఇది. రెండేళ్ల క్రితం వచ్చిన వరదకు ఈ ప్రాంతం ధ్వంసమై రూపురేఖలు కోల్పోయింది. అప్రాన్, కాలువ మధ్య రక్షణ గోడ కొట్టుకుపోయింది. ఈ రెండు గేట్ల నుంచి వరద వదిలితే నీరంతా అప్రాన్‌లోకి చేరుతుంది. దీంతో జలాశయం ముందు భాగం మరింత దెబ్బతింటుంది. ఈ పనులు అత్యవసరంగా చేయాలని నిపుణలు సూచించారు. అయితే ఇంతవరకు ఆ ఊసే లేదు. ప్రస్తుతం కాలువలో కొంత మేర నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆ నీటిని నియంత్రణ చేస్తూ కాలువలో గట్టు ఏర్పాటు చేసి రక్షణ గోడ పనులు చేయాల్సి ఉంది.

అనంతసాగరం, ఆగస్టు 3 : సోమశిలకు ఎగువ నుంచి వరద రాక మొదలైంది. నీటి నిల్వ 40 టీఎంసీలకు చేరుకుంది. మరోవైపు వచ్చే నెల నుంచి తుఫాన్లు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.



అప్రాన్‌లో కాంక్రీట్ పనులు చేయక కనిపిస్తున్న కొండచరియలు

అయితే వర్షాలకు ముందే సోమశిలను సమగ్రాభివృద్ధి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినా ఫలితం కనిపించడం లేదు. దీంతో జలాశయం మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. గత వైసీపీ హయాంలో పాలకులు సోమశిల ప్రాజెక్టును పూర్తిగా విస్మరించారు. వరుసగా రెండేళ్లపాటు కొనసాగిన వరద నష్టాన్ని పూడ్చలేక పోయారు. ఈ క్రమంలో డ్యాం పరిస్థితి దయనీయంగా మారింది. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ సోమశిల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఇటీవల సీఎం చంద్రబాబు డ్యాంను సందర్శించి వైసీపీ హయాంలో ఆగిన పనులు వెంటనే పూర్తిచేసి ప్రాజెక్టు మనుగడ కాపాడేలా అధికార యంత్రాంగానికి సూచనలు చేశారు. అయితే, సుమారు 50 రోజుల క్రితం పునఃప్రారంభమైన పురోగతి పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. వర్షాలకు ముందే పనులు పూర్తిచేసేలా షరతు విధించినా కాంట్రాక్టరులో మార్పు లేదు. పనులకు అవసరమైన ఇసుకను మర్రిపాడు డంప్‌యార్డ్ నుంచి 20 వేల మెట్రిక్ టన్నులకు అనుమతి కల్పించారు. ఇక రోజు వారీగా 1000 క్యూబిక్ మీటర్ల మేరకు కాంక్రీట్ పనులు చేయాల్సి ఉన్నా ఆ దిశగా పనులు జరగడం లేదు.

● 20 రోజుల్లో నిండుకుండలా..

సోమశిలకు వరద రోజు రోజుకు పెరుగుతోంది. డ్యాం పూర్తిసామర్థ్యం 77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 40 టీఎంసీలకు చేరువైంది. ఇప్పుడు 22,283 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వరద ఇలాగే కొనసాగితే 20 రోజుల్లో డ్యాం నిండనుంది. జలాశయం పూర్తిసామర్థ్యానికి చేరితే క్రస్ట్‌గేట్లు ఎత్తి నీరు కిందకు వదలక తప్పదు. అప్పుడు పనులు చేసేందుకు వీలుండదు. ఈ క్రమంలో 20 రోజుల్లో అత్యవసర పనులు ముగించాల్సి ఉంది. చర్యలు మాత్రం కనిపించడం లేదు. మరోవైపు రెండు రోజుల క్రితం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమశిల వద్ద జరుగుతున్న పనులు చూసి ఆవేదనకు గురయ్యారు. నిర్లక్ష్యంగా జరుగుతున్న పనులపై సీఎంవో కార్యాలయానికి సమాచారం ఇచ్చారు.

పేపర్..!

- ఉషోదయ 'వార్తా' వారధి
- పొద్దున్నే పత్రికతో పలకరింపు
- ఆరోగ్యం... ఆదాయం
- నేడు అంతర్జాతీయ పేపర్ బాయ్స్ దినోత్సవం

పేపర్.... వేకువజామున చీకట్లో వీధుల్లో వినిపించే తొలిపలుకు ఇదే. పాఠకుల ప్రపంచానికి ఉదయించే సూర్యుడు పేపర్‌బాయ్. తెల్లవారక మునుపే వార్తా పత్రికల ద్వారా ప్రపంచాన్ని పాఠకులకు చూపించేది అతడే. దిన పత్రిక అంటే నిరంతర శ్రమ ద్వారా ఎందరో రూపొందించిన వార్తల సమాహారం. పాత్రికేయులు రేయింబవళ్లు కష్టించి సేకరించిన వార్తల్ని సంపాదక బృందం అందంగా అమర్చి అచ్చువేస్తారు. వీరందరి శ్రమను పాఠకుల ముందుకు సకాలంలో తీసుకువెళ్లే సైనికుడే పేపర్ బాయ్.



కుటుంబానికి చేదోడుగా...

ప్రతిరోజూ ఉదయాన్నే ఇంటింటికి పేపర్ వేయడం చాలెంజింగ్‌గా ఉంటుంది. నేను ఊహించకుండానే ఈ అవకాశం వచ్చింది. కుటుంబానికి చేదోడువాదోడు ఉంటుందని పేపర్ వేస్తున్నాను. ఉదయం 3గంటల నుంచి 7గంటల వరకు ఇంటింటికి పేపరు వేసి ఇంటి పనులు చూసుకుంటున్నారు. కొత్తల్లో వేకువనే నిద్ర లేవాలంటే కష్టంగా ఉండేది ఇప్పుడు అలవాటైపోయింది.

- పీ జానకి, కల్లూరుపల్లి, ఇందిరమ్మ కాలనీ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 3 : ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠకుల ఇళ్లకు న్యూస్‌పేపర్ వేయడం అంత తేలికైన పనికాదు. చలియైన, వర్షమైనా తెల్లవారుజామున 3గంటల నుంచే క్రమశిక్షణతో ఈ పని చేయాలి. కట్టగా వచ్చే పత్రికలను పేర్చు కుని సైకిల్‌కి కట్టుకొని సూర్యోదయానికి ముందే పాఠకుల గృహాలకు చేరవేయాలి. అలాంటి పేపర్‌బాయ్ లేకుంటే పత్రికల మనుగడ ప్రశ్నార్థకమే!. అందుకనే న్యూస్ పేపర్ అసోసి యేషన్ ఆఫ్ అమెరికా సెప్టెంబరు 4వ తేదీని అంతర్జాతీయ పేపర్ దినోత్సవంగా ప్రకటిం చింది. తొలి పేపర్ బాయ్‌గా పనిచేసిన బార్నా ప్లాహెర్టీ జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబ రు 4న అంతర్జాతీయ పేపర్ బాయ్ దినోత్సవం జరుపుకుంటారు. విద్యార్థి దశలో ఖర్చులకనో, కుటుంబానికి ఆసరాగా ఉండేందుకనో ఎంతో మంది పేపర్‌బాయ్ చేరుతుంటారు. ఈ సందర్భంగా అలవడిన క్రమశిక్షణతో జీవితంలో ఉన్నతస్థానాలకు చేరినవారూ ఉన్నారు.

● ఎందరో మహానుభావులు

ప్రపంచ అణు విజ్ఞాన శాస్త్రంలో దిగ్గజం, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిన్న తనంలో పేపర్ బాయ్‌గా పనిచేసి చదువు కుంటూనే కుటుంబానికి ఆర్థిక తోడ్పాటును అందించారు. స్వాతంత్ర్య సమర యోధుడు లోకమాన్య బాలగంగాధర్‌తిలక్ స్వాతంత్ర్య ఉద్యమం తొలినాళ్లలో పీపుల్ వార్ పత్రికకు పేపర్‌బాయ్‌గా పనిచేశారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ్ కూడా మొదట్లో పేపర్‌బాయ్‌గా పనిచేసి ఆ తర్వాత గొప్ప సాహితీవేత్తగా ఎదిగారు.

పేపర్ వేయడం సంతృప్తినిస్తోంది



నేను ఎంఏ లిటరేచర్ చేశాను. తగిన ఉద్యోగం దొరకకపోవటంతో కొద్దికాలం ప్రైవేటు కళాశాల్లో లెక్చరర్‌గా పనిచేశాను. అక్కడ ఇచ్చే జీతం సరిపోక ఆటో డ్రైవర్‌గా మారాను. వేకువజామున పని ఉండదు కనుక పేపర్ వేస్తే మరికొంత ఆదాయం వస్తుందన్న ఆలోచ నతో కొన్నేళ్లుగా ఆంధ్రజ్యోతి పేపర్ పార్శిల్స్ బస్సుల్లో పెట్టడంతో పాటు చందాదారులకు పేపర్ వేస్తున్నాను. ఈ పని నాకెంతో సంతృప్తినిస్తోంది.

- తన్నీరు నరేంద్ర, కందుకూరు


ఉపాధి లభించింది



ఎలాంటి ఉపాధి లేక తిరుగుతున్న నాకు ఆంధ్ర జ్యోతి పేపర్ బాయ్‌గా, ఏజెంట్‌గా ఉపాధి లభించింది. 20 ఏళ్లకుపైగా పేపర్‌బాయ్‌గా, ప్రస్తుతం ఏజెంట్‌గా పని చేస్తున్నా. ఉదయం 4గంటలకల్లా బస్టాండ్ చేరుకొని పత్రి కలు సర్దుకుని తెల్లవారక ముందే పాఠ కుడికి అందజేస్తున్నా. దీంతో వచ్చే ఆదా యంతో కుటుంబాన్ని పోషిస్తున్నాను.

- షేక్ ఖాజామస్తాన్, ఉదయగిరి

22 ఏళ్ల నుంచి పేపర్ వేస్తున్నా..



నేను పదో తరగతి వరకు చదువు కున్నా. 22 ఏళ్ల క్రితం పేపర్ బాయ్‌గా చేరాను. విద్యార్థి దశ నుంచే పేపర్ వేస్తున్నా ను. ప్రతి రోజూ ఉదయం 3:30 గంటలకు నిద్రలేచి సెంటర్‌కు వెళ్లి పత్రికలు తీసుకుని పాఠకుల ఇళ్లకు వెళ్లి ఇచ్చేవాడిని. మొదట్లో నెలకు రూ.120 సంపాదనగా వచ్చేది. చదువుకుంటూ డబ్బు సంపాదించుకోవడం ఆనందంగా ఉండేది. ఆంధ్రజ్యోతి పేపర్‌బాయ్‌గా కొనసాగుతూనే అదే దినపత్రిక ఏజన్సీ తీసుకున్నాను. పేపర్ ఏజెంట్‌గా ఆత్మకూరులో గుర్తింపు తెచ్చుకోగలిగాను. ఏజెన్సీ కొనసాగిస్తూనే మెటల్ స్టోర్ నిర్వహిస్తున్నాను.

- కనుమర్లపూడి గురుబ్రహ్మం, ఆత్మకూరు

వ్యాయామం, ఆదాయం



ప్రతి రోజూ ఉదయాన్నే దిన పత్రికను ఇళ్లకు వేయడం శరీరానికి మంచి వ్యాయామమే కాక ఆర్థికంగా చేయూత లభిస్తుంది. ఉదయాన్నే ఒక గంట సేపు వీధుల్లో తిరిగి పేపరు వేయడం వల్ల శారీరక శ్రమ కలిగి ఆరోగ్యంగా ఉంటా రు. అలాగే ప్రజలకు అవసరమైన సమాచారాన్ని పత్రిక ద్వారా అందించిన సంతృప్తి కలుగుతోంది. పేపర్ వేయించు కునే వారందరితో పరిచయాలు ఏర్పడి ప్రజా సంబంధాలు మెరుగుపడతాయి.

- షేక్ రఫీ, కావలి



ఆహారం తయారీని పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నిరాశ్రయులకు చేయూత!

- కార్పొరేషన్ నుంచి ఆహార పొట్లాల తరలింపు
- 10 మంచినీటి ట్యాంకులు, 9 డీజిల్ ఇంజన్లు కూడా..

నెల్లూరు (సిటీ) : విజయవాడలో జల ప్రళయానికి నిరాశ్రయులైన బాధితులను ఆదుకునేందుకు నెల్లూరు కార్పొరేషన్ అధికారులు సిద్ధమయ్యారు. కమిషనర్ సూర్యతేజ నేతృత్వంలో మంగళవారం ఉదయం 55 వేల అల్పాహార ప్యాకెట్లతో ఓ లారీని విజయవాడకు తరలించారు. మధ్యాహ్నం, రాత్రి 2 లక్షల మందికి ఆకలి తీర్చేందుకు భోజన ప్యాకెట్లతో మరో లారీ బయలుదేరగా, దాహార్తిని గట్టెక్కించడానికి 10 మంచినీటి ట్యాంకర్లు, నివాసాల వద్ద మురుగు నీరు బయటకు పంపే 9 డీజిల్ ఇంజన్లను బెజవాడకు తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ సూర్యతేజ మాట్లాడుతూ హోటళ్లు, క్యాంటరింగ్‌లు, మెస్‌ల నిర్వాహకుల ద్వారా ఆహార ప్యాకెట్లను తయారు చేసి విజయవాడకు పంపుతున్నామని తెలిపారు. దాతల దాతృత్వం కూడా విపత్తు బాధితులకు అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం కందుకూరు సబ్‌కలెక్టర్‌గా నూతన బాధ్యతలు తీసుకున్న తిరుమని శ్రీపూజ కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

● నెల్లూరు (హరనాథపురం) : వరద బాధితుల కోసం జిల్లా నుంచి 30,185 ఆహార పొట్లాలను 3 కంటైనర్లలో విజయవాడకు పంపినట్లు డీఎస్‌ఓ వెంకట రమణ తెలిపారు.



ఆహార పొట్లాలు ఉన్న కంటైనర్

● సంగం : తహసీల్దారు సోమ్లా నాయక్, వీఆర్వోలు శ్రీనివాసులు రెడ్డి, ఖాజా రసూల్, శోభన్‌బాబులు విజయవాడలో సహాయ కార్యక్రమాల్లో మంగళవారం ముమ్మరంగా పాల్గొన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున ఆహార ప్యాకెట్లు సరఫరా చేస్తున్నారు.

● సైదాపురం : వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు మంగళవారం రెండు బృందాలు బయలుదేరినట్లు ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఇద్దరు ఎలక్ట్రీషియన్లు, ఇద్దరు ప్లంబర్లు, ముగ్గురు శానిటేషన్ వర్కర్లు ఉన్నారు. వీరికి లీడర్లుగా సైదాపురం సెక్రటరీ వంశీకృష్ణ, తుమ్మలతలుపూరు సెక్రటరీ కార్తీక్ ఉన్నట్లు చెప్పారు.

ఆయాల వేతనాల చెల్లింపునకు ఆదేశాలు

నెల్లూరు (విద్య): పాఠశాల విద్యాశాఖ బడ్జెట్ అంచనాల ప్రకారం 2024- 25 విద్యా సంవత్సరానికి ఆయాలు, నైట్ వాచ్‌మెన్ వేతనాలతో పాటు క్లీనింగ్ మెటీరియల్స్‌కు నిధులు విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా అధికారులు తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న 2764 మంది ఆయాలకు ఒక్కొక్కరికి రూ.6,438 చొప్పున గౌరవవేతనం విడుదలైందన్నారు. ఆర్థికశాఖ అనుమతులతో ఈ నిధులను త్వరలోనే వారి ఖాతాల్లో జమచేస్తామని పేర్కొన్నారు. అలాగే పాఠశాలల మరుగుదొడ్ల నిర్వహణ, శుభ్రత సామ గ్రిని కూడా విడుదల చేస్తామని తెలిపారు.


బాలుడు వరణ్‌తో వైద్య బృందం

పేదోళ్ల ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స!

- ఏరియేటర్ ఫ్యాన్‌లో ఇరుక్కుపోయిన బాలుడు
- ఐదు చోట్ల విరిగిన ఎముకలు
- ప్రాణాపాయస్థితిలో జీజీహెచ్‌లో చేరిక
- 5 గంటలు శ్రమించి శస్త్రచికిత్స చేసిన వైద్యులు

నెల్లూరు (వైద్యం) : ఒకటికాదు.. రెండు కాదు... ఐదు చోట్ల కాళ్ల, చేతుల ఎముకలు విరిగిపోయాయి. ఏడేళ్ల పసిప్రాయం కావడంతో శస్త్ర చికిత్స చేసేందుకు 'ప్రైవేటు' డాక్టర్లు సాహసం చేయలేకపోయారు. అయితే, నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) వైద్యులు మాత్రం ఐదు గంటలపాటు శ్రమించి దిగ్విజయంగా శస్త్రచికిత్స పూర్తి చేసి మన్ననలు అందుకున్నారు. ఈ వివరాలను మంగళవారం జీజీహెచ్ సూపరిం టెండెంట్ సిద్దా నాయక్ విలేకరులకు వెల్లడించారు.

ఇందుకూరుపేట మండలం రాముడుపాళెంలోని రొయ్యల గుంట వద్ద చెంబేటి నాగరాజు, అనితల దంపతులు కాపలాగా ఉంటున్నారు. గత నెల 8వ తేదీన వీరి కుమారుడు వరుణ్ (7) ఆడుకుంటూ పొరపాటున గుంటలో తిరుగుతున్న ఏరియేటర్ ఫ్యాన్‌పై పడి, ఇరుక్కుపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి బాలుడ్ని తీసుకెళ్లగా మత్తు ఇవ్వాలంటే చాలా ఇబ్బందని తిరస్కరించారు. దీంతో వారు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి (జీజీహెచ్) తీసుకువచ్చారు. ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ మస్తాన్‌బాషా బాలుడ్ని పరిశీలించి, చేతులు, కాళ్ల వద్ద ఐదు చోట్ల ఎముకలు విరిగినట్లు గుర్తించారు. 20 మంది వైద్యులు, సిబ్బందితో రెండు బృందాలుగా ఏర్పడి ఐదు గంటలు శ్రమించి విరిగిన ఎముకలకు శస్త్రచికిత్స చేసినట్లు డాక్టర్ మస్తాన్‌బాషా తెలిపారు. ఇప్పుడు పూర్తి స్థాయిలో బాలుడు కోలుకుంటున్నాడని, త్వరలో డిశ్చార్జి చేయనున్నట్లు చెప్పారు. రూ.5 లక్షల విలువ చేసే శస్త్ర చికిత్సను ఉచితంగా నిర్వహించినట్లు చెప్పారు. తమ బిడ్డను బతికించిన వైద్యులకు నాగరాజు దంపతులు కృతజ్ఞతలు తెలియచేశారు. సమావేశంలో వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ గోవింద్, వైద్యులు దివ్య, అనిల్, రాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు : డ్రైవర్‌కు గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

మనుబోలు, సెప్టెంబరు 3: మండల పరిధిలోని జాతీయరహదారిపై కాగితాలపూరు క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. కాగితాలపూరుకి చెందిన చిల్లకూరు మనోహర్‌రెడ్డి ఆటో తీసుకుని గ్రామానికి వెళ్లేందుకు మలుపుతిప్పుతుండగా, నెల్లూరు నుంచి వేగంగా వస్తున్న కారు, ఆటోను ఢీకొని వెళ్లిపోయింది. దీంతో ఆటో దెబ్బ తింది. ఆటో నడుపుతున్న మనోహర్‌రెడ్డికి తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయన్ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాము కాటుతో యువకుడి మృతి

బిట్రగుంట, సెప్టెంబరు 3: బోగోలు మండలం అల్లిమడుగు సంఘంకు చెందిన బొచ్చు శంకర్ (34) పాము కాటుకు గురై మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. బేల్దారు మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న శంకర్ సోమవారం రాత్రి ఇంటి వద్ద ఆరుబయట కింద చాపపై నిద్రించాడు. ఈక్రమంలో విష సర్పం కాటేసింది. దీంతో కుటుంబ సభ్యులు అతనిని చికిత్స నిమిత్తం కోవూరుపల్లి పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య బొచ్చు శీనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై బోజ్యా తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య

- ఆర్థిక లావాదేవీల్లో విభేదాలు


ఎం. పాల్ (ఫైల్)

నెల్లూరు,(క్రైం), సెప్టెంబరు 3: నెల్లూరులోని ముత్యాలపాళెంలో మంగళవారం తెల్లవారుజా మున ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల వివరాల మేరకు... బోగోలు మండలం చెన్నారాయునిపాళెం గ్రామానికి చెందిన ఎం పాల్ (35) ఫైనాన్స్, ట్రావెల్స్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. ఆయనకు ముగ్గురు భార్యలు. నాని, ప్రభుసాయి అనే వ్యక్తులతోపాటు మరికొందరితో ఆర్థిక లావాదేవీలతోపాటు మరికొన్ని విషయాల్లో పౌల్‌కు విభేదాలున్నాయి. కాగా, పౌల్ 20 రోజులుగా ముత్యాలపాళెంలోని మూడో భార్య కవిత వద్ద ఉంటున్నాడు. ఇటీవల పౌల్ ఇంట్లో లేని సమయంలో నాని, ప్రభు సాయి ఇంటికి వెళ్లి పౌల్‌ను చంపేస్తామని కుటుంబ సభ్యులను బెదిరించి వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం కర్లాలమిట్టలో పౌల్, ప్రభుసాయి మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిసింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పౌల్ బైక్‌పై ఇంటికి వెళుతుండగా అప్పటికే ఆటోలో వేచి ఉన్న ఐదుగురు వ్యక్తులు బైక్‌ను అడ్డగించారు. కత్తులతో విచక్షణారహితంగా ఒంటిపై ఎనిమిది సార్లు పొడిచారు. బలమైన కర్రతో తలపై కొట్టడంతో పౌల్ అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. పౌల్ హత్య విషయం తెలుసుకున్న కవిత బాలాజీ నగర్ పోలీసులకు సమాచారం అందించింది. నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు, చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తదితరులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. జీజీహెచ్ మార్చురీకి తరలించారు. హత్యకు దారి తీసిన పరిస్థితులను పౌల్ కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నిందితుల్లో ఒకరు అపోలో ఆసుపత్రి ప్రాంతానికి చెందిన జయగా పోలీసులు గుర్తించారు. మంగళవారం పౌల్ భార్య కవిత ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బాలికలు, మహిళల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ కృష్ణకాంత్ • కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లతో సమావేశం



కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్ల సమావేశంలో ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు,(క్రైం), సెప్టెంబరు 3: బాలికలు, విద్యార్థినులు, మహిళల మిస్సింగ్ నేరాలు అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. జిల్లాలో మిస్సింగ్ కేసుల నివారణపై నెల్లూరు సిటీ, రూరల్ పరిధిలోని కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లతో ఎస్పీ మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. బాలికలు, మహిళల మిస్సింగ్ కేసుల నివారణకు ప్రత్యేక కార్యాచరణకు రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. పాఠశాల, కళాశాలల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. హాస్టళ్లలో భద్రతపరంగా కఠినంగా ఉండాల న్నారు. కాలేజీలలో కమిటీలు ఏర్పాటు చేసి, వాటిలో విద్యార్థులు, అధ్యాపకులు, పోలీస్ తరఫున ఒకరిని భాగస్వామ్యులను చేయాలని కోరారు. ఎటువంటి సమస్య తలెత్తినా వెంటనే డయల్ 112 టోల్‌ఫ్రీ నెంబరునుగానీ, స్థానిక పోలీసులనుగానీ సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సౌజన్య, సిటీ, రూరల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	102
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	210
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.6882
వెండి కిలో ధర	రూ. 84,400
వెండి ఒక గ్రాము	రూ. 87.40

బయటపడ్డ డొల్లతనం!

- దెబ్బతిన్న కండలేరు కాలువ అత్యవసర గేటు
- మునిగిపోయిన పొలాలు, రోడ్డుపైకి నీరు
- అధికారుల నిర్లక్ష్యమే కారణమా!?

కలువాయి, సెప్టెంబరు 3 : సోమశిల కండలేరు వరద ప్రవాహపు కాలువ (ఎస్‌కేఎఫ్‌ఎఫ్) 5.5 కి.మీ వద్ద ఎమర్జెన్సీ ఎస్కేప్ (అత్యవసర గేటు) దెబ్బతినడంతో మంగళవారం నీరంతా వృథా అయ్యింది. కాలువలో నుంచి నీటి ప్రవాహం వాగు ద్వారా కుల్లూరు చెరువుకు చేరుతోంది. ఈ నీటితో చెరువు కూడా నిండి కలుజు వాగు ద్వారా ఆయకట్టు పొలాలపై పడింది. దీంతో పొలాలన్నీ మునిగిపోయాయి. వెంకటరెడ్డిపల్లి సమీపంలో పొదలకూరు-సోమశిల ప్రధాన రహదారిపై కూడా నీరు చేరింది. రెండు వారాల నుంచి సోమశిల జలాశయం నుంచి కండలేరుకు నీరు విడుదల చేస్తున్నారు. 2వేల క్యూసెక్కుల నుంచి అంచెలంచెలుగా పెంచుతూ 6వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఈ కాలువకు ఎక్కడైనా గండ్లు పడి ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో కాలువలోని నీటిని మళ్లించేందుకు అక్కడక్కడ అత్యవసర గేట్లు నిర్మించారు. ఈ క్రమంలో 5.5 కి.మీ వద్ద నిర్మించిన గేటు మంగళవారం దెబ్బతినడంతో కాలువలోని నీరంతా బయటకు ప్రవహించి సమీప చెరువులను, పొలాలను ముంచుతోంది. దీనికి వరి గడ్డి, ఇసుక బస్తాలను వేసినా నీటి వృథాను అరికట్టలేకపోయారు.


చెరువు కాదు.. పొలాలే..

• బయట పడుతున్న లోపాలు

తెలుగుగంగ పథకంలో అంతర్భాగమైన సోమశిల కండలేరు వరద కాలువ నిర్వహణలో లోపాలు బయట పడుతున్నాయి. సోమశిల నుంచి కండలేరుకు నీటిని తరలించే కాలువ మొత్తం పొడవు 46 కి.మీ ఉంది. ఈ కాలువకు ఎక్కడైనా గండ్లు పడితే నీటిని సమీపంలోని చెరువులకు మళ్లించేందుకు మూడు చోట్ల అత్యవసర గేట్లు నిర్మించారు. 5.5, 18.4, 43 కి.మీ వద్ద ఈ గేట్లు ఉన్నాయి. అయితే ఈ గేట్ల నిర్వహణను ఏనాడూ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవన్న విమర్శలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఎంతో ఆర్భాటంగా కాలువ విస్తరణ పనులు చేపట్టి మూడు నాళ్లకే అటకెక్కించారు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఈ కాలువ గేట్లు నిర్వహణ పనులు చేపట్టడంతోపాటు కాలువ విస్తరణ పనులు కూడా పూర్తి చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.


అత్యవసర గేటు నుంచి బయటకు వస్తున్న నీరు


కలుజు పారుతున్న కుల్లూరు చెరువు

గజ ఈతగాళ్లు వస్తున్నారు!

విశాఖ నుంచి గజ ఈతగాళ్లను రప్పించడంతోపాటు ఆక్సిజన్ సిలిండర్లను తెప్పిస్తున్నాం. త్వరగా పనులు చేపట్టి బుధవారం సాయంత్రానికి పూర్తి చేస్తాము.

- శ్రీనివాసులురెడ్డి, తెలుగుగంగ కుల్లూరు డీఈ

గిరిజన సంక్షేమం సబ్‌ప్లాన్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆనంద్


సబ్‌ప్లాన్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 3 : జిల్లాలో 2024-25 సంవత్సరానికిగాను గిరిజన సంక్షేమా నికి సంబంధించి సబ్‌ప్లాన్‌ను పక్కాగా అమలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళ వారం ఉదయం కలెక్టరేట్ శంకరన్ హాల్లో ఆ ప్లాన్ అమలుకు శాఖల వారీగా సమీక్ష జరిపారు. ఎస్టీల పరిపుష్టి కోసం ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కేటాయింపులు చేయాలని సూచించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఎస్టీలకు ప్రయోజనాలు సమకూర్చాలని, వారు నివసించే ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. మూడు రోజుల్లో సబ్‌ప్లాన్‌కు సంబంధించి కేటాయింపుల నివేదికను ఐటీడీఏ అధికారు లకు అందించాలని ఆదేశించారు. ఈ సమవేశంలో ఐటీడీఏ పీవో పరిమళ, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోదాములను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి

జిల్లాలోని బహుళ ప్రయోజన గోదాములను పీఏసీ ఎస్‌లు పూర్తి స్థాయిలో వినియోగిం చుకోవాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. మంగళ వారం గోదాముల అమలు కమిటీ జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్ లో జరిగింది. జిల్లాలో 43 గోదాములు ఉన్నా యని, వాటిని పీఏసీఎస్‌లకు అప్పగించామని చెప్పారు. వాటిలోని కొన్నిం టిలో రైతులు పం ట దిగుబడిని నిల్వచేసుకున్నారని తెలిపారు. మిగిలిన గోదాములను పౌరసరఫరాల శాఖ వారు బాడుగ పద్ధతిలో నిర్వహించ డానికి సహకార సంఘాల కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ కార్య క్రమంలో డీసీవో గురప్ప, డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు, నాబార్డు జిల్లా మేనేజర్ డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి : కలెక్టర్

నెల్లూరు (విద్య): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనాన్ని రుచిగా అందించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రుల కమిటీలు, భోజన తయారీ ఏజెన్సీలతో ఆయన సమీక్ష జరిపారు. జిల్లాలోని 2,570 పాఠశాలల్లో 1,66,056 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారని చెప్పారు. వారికి అందించే భోజనం నాణ్యత విషయంలో రాజీపడకుండా పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రామారావు, అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఫలాలు మాదిగలకు అందేలా పోరాటం

- ఎంఎస్పీ జాతీయ నాయకుడు శ్రీనివాస్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 3 : ఎస్సీ వర్గీకరణ ఫలాలు మాదిగ జాతికి అందే విధంగా ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందని ఎంఎస్పీ జాతీయ నాయకుడు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. మంగళవారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అత్యవసర సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎమ్మా ర్పీఎస్, ఎంఎస్పీను గ్రామ, మండల స్థాయిలో పునర్నించుకోవాలన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధించామని, జేఏసీల పేరు చెప్పుకొని కాయలు అమ్ముకొనే వారి విషయంలో జాతి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొపర్తి కొండయ్యమాదిగ, ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపాక మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

8న ఆట్యాపాట్యా జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 3 : జిల్లా ఆట్యాపాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని బీవీఎస్ నగరపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 8వతేదీ ఉదయం 10 గంటలకు జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కే కృష్ణవేణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 14, 15 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ ఆట్యాపాట్యా పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. రాష్ట్రస్థాయిలో సత్తాచాటితే పాండిచ్చేరిలో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధిస్తా రన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2007 జనవరి 1వతేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9493582143, 9966191956 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సోమశిలకు 22,283 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, సెప్టెంబరు 3: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 22,283 క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 40 టీఎంసీలకు చేరుకొంది. దిగువ డెల్టాకు 1,050, కండలేరుకు 6,000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు నీటిని సరఫరా చేస్తున్నారు.

నెల్లూరు రైల్వే స్థలాలు లీజుకు

- ప్రధాన స్టేషన్ పడమర వైపు ఉన్నవి..
- 45 ఏళ్ల లీజుకు 7795.31 చ.మీటర్లు
- టెండర్లకు ఈ నెల 20 ఆఖరు


లీజుకు ఇవ్వనున్న రైల్వే స్టేషన్ పడమర వైపు స్థలం

నెల్లూరు (వెంకటేశ్వరపురం) సెప్టెంబరు 3 : నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ పడమర వైపు ఉన్న రైల్వే స్థలాలను 45 ఏళ్లపాటు ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వనున్నట్లు ఆర్‌ఎల్‌డీఏ (రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రకటించింది. ఇప్పటికే ఆత్మకూరు బస్టాండును అనుకొని ఉన్న ప్రాంతాన్ని లీజుకు ఇచ్చారు. తాజాగా రైల్వే స్టేషన్ పడమర వైపు బైక్ పార్కింగ్ వద్ద నుంచి రంగనాయకులపేట గేటు వరకు గల దాదాపు 7795.31 చ.మీటర్ల స్థలాన్ని డెవలప్‌మెంట్‌కు 45 ఏళ్లపాటు లీజుకు ఇవ్వనున్నారు. ఈ మేరకు టెండర్ నోటిఫికేషన్‌ను ఆర్‌ఎల్‌డీఏ ఇప్పటికే విడుదల చేసింది. ఆన్‌లైన్ బిడ్ ద్వారా ఈ స్థలాలను లీజుకు ఇవ్వనున్నారు. టెండర్ బిడ్ ధరను రూ.15.50 కోట్లుగా నిర్ణయించారు. ఈ నెల 20వ తేదీలోగా ఆసక్తి కలిగిన వ్యక్తులు బిడ్ దాఖలు చేయవచ్చని ప్రకటించారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ ఈ లీజు డెవలప్‌మెంట్ ద్వారా మరింత అభివృద్ధి చెందుతుందని రైల్వే అధికారులు అభిప్రాయపడుతున్నారు. టెండర్ దక్కించుకున్న వ్యక్తులు రైల్వే స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్, సినిమా థియటర్ వంటివి అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

గండువారిపల్లిలో కలకలం

- ఇంటిలో గుప్తనిధులు ఉన్నాయని అపోహ
- గుంతలు తవ్వి క్షుద్రపూజలు • పోలీసుల అదుపులో నలుగురు
- పోలీస్‌స్టేషన్ ముట్టడి • పోలీసుల హామీతో ఆందోళన విరమణ

ఏఎస్ పేట, సెప్టెంబరు 3 : ఆ దంపతులు అత్యాశకు పోయారు. గుప్తనిధులు ఉన్నాయనే అపోహతో సొంత ఇంటిలోనే గుంతలు తవ్వి క్షుద్రపూజలు చేశారు. రాత్రిపూట కేకలు, ఇంటి చుట్టూ నిమ్మకాయలను చూసిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అంతే వారొచ్చి సదరు దంపతులతోపాటు పూజలు చేస్తున్న దంపతులనూ అదుపులోకి తీసుకున్నారు. ఏఎస్ పేట పంచాయతీ గండువారిపల్లిలో మంగళవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేగింది.

గండువారిపల్లికి చెందిన షేక్ షాజహాన్ వెల్డింగ్ పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే, తన ఇంట్లో గుప్తనిధులు ఉంటాయనే అపోహతో నెల్లూరుకు చెందిన పూజారి ఎం శ్రీరామమూర్తి, భర్య అంకమ మానస గౌరి ప్రియలతో వారం రోజులుగా పూజలు చేయిస్తున్నారు. పిండితో మూడు బొమ్మలు తయారు చేసి వాటికి మేకులు కొట్టి ఇంట్లోనే 10 అడుగుల గుంత తవ్వి అందులో వేసి పూజలు చేశారు. మంత్రించిన నిమ్మకాయలను ఇంటి చుట్టూ వేసేవారు. మంగళవారం ఉదయం నిమ్మకాయలను గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సైదులు తన సిబ్బందితో ఇంట్లోకి వెళ్లి పరిశీలించారు. పెద్ద గుంత తవ్వి పూజలు చేసి ఉండటం గమనించి షాజహాన్, ఈయన భర్య రజీయబేగం, పూజారి దంపతులను అదుపులోకి తీసుకున్నారు.

• పోలీస్‌స్టేసన్ ముట్టడి


పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్థులు

ప్రాథమిక పాఠశాల ఆనుకొని, ఇళ్ల మధ్య పూజలు చేయ డాన్ని ఆగ్రహించిన గ్రామస్థులు పోలీస్ స్టేసన్‌ను ముట్టడించా రు. పూజలు చేసిన వారిని తమకు అప్పగించాలని పోలీసు లతో వాదనకు దిగారు. ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. సంగం, ఆత్మకూరు సీఐలు వేమారెడ్డి, గంగధార్, ఆత్మకూరు ఎస్‌ఐ జిలానిలు బలగాలతో అక్కడకు చేరుకున్నారు.

• కఠిన చర్యలు తీసుకుంటాం : సీఐ

సంగం సీఐ వేమారెడ్డి గ్రామస్థులతో మాట్లాడారు. పూజలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. గ్రామంలో తిరుగుతూ మహిళలకు ధైర్యం చెప్పారు. మోడ్రన్ స్కూల్లో విద్యార్థులకు పూజలు, సైన్స్‌పై అవగాహన కల్పించారు. పూజలు చేసిన నలుగురిని అదుపులోకి తీసుకొని, కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

అక్రమ లేఅవుట్ల గుట్టు రట్టు!

- నుడా అనుమతులు లేకుండానే విక్రయం
- ఆందోళనలో కొనుగోలుదారులు

బిట్రగుంట: బోగోలు మండలంలో నుడా అనుమతులు లేకుండా అక్రమంగా లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయించిన గుట్టు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోన్నాయి. అందులో భాగంగా అధికారులు గుర్తించిన ఓ లేఅ వుట్‌లో దీనికి నుడా అనుమతులు లేవంటూ బోర్డు ఏర్పాటు చేయడంతో ఆ లేవుట్లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన లేఅవుట్లకు అనుమతులు లేవని తెలిసినా అప్పట్లో అధికారులు నోరు మెదపలేదు. ఈ క్రమంలో కప్పరాళ్ల తిప్ప వద్ద జాతీయ రహదారి సమీపంలో దాదాపు 25 ఎకరాల్లో అక్రమ లేఅవుట్ వేశారని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అప్పట్లో వెలుగులోకి తేవడంతో అది అబద్ధపు ప్రచారమంటూ వైసీపీ నేతలు నోర్లు విరుచుకుపడ్డారు. ఇప్పుడు రాష్ట్రంలో ప్రభు త్వం మారడంతో అసలు నిజం బయటపడేసరికి అదే నేతలు నోర్లు మెదపక మౌనం వహించారు. బోగోలు తహసీల్దారు కార్యాలయానికి కూతవేటు దూరం లో 12 ఎకరాల్లో నిర్మాణంలో ఉన్న లేఅవుటుకు అనుమతులు లేవని ఇటీవల అధికారులు బోర్డులు ఏర్పాటు చేయడంతో ప్లాట్లు కొనుగోలు చేసి వాళ్లు గగ్గోలు పెడుతున్నారు. అలాగే అల్లిమడుగు పంచాయతీ కడనూతల గ్రామం లో సర్వే నెంబరు 840/1లో వైసీపీ నేత నుడా అనుమతులు లేకుండా ప్లాట్లు వేసి దాదాపు విక్రయించాడని స్థానికులు అధికారులకు, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో దానిపై విచారణ జరపాలని ఆయన తహసీల్దారును ఆదేశించినట్లు సమాచారం. ప్రస్తుతం మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్లకు నుడా అనుమతులు లేవని అధికారులు అంటున్నారు. అయితే ఈ మూడు లేఅవుట్లలో వైసీపీ బడా నేతల పాత్ర, భాగస్వామ్యం ఉందన్నందున అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసి విక్రయిస్తున్న లేఅవుట్ల నిర్వాహకులపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే. కాగా ఈ అక్రమ లేవుట్లకు అనుమతులు లేకుండా అధికారాన్ని, అధికార పార్టీ నేతల అండదండలతో ఎక్కడ పడితే అక్కడ గ్రావెల్ తవ్వి తరలించారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.


నుడా అనుమతులు లేవని ఏర్పాటు చేసిన బోర్డు

విజృంభిస్తున్న విషజ్వరాలు

- కొరవడిన పారిశుధ్యం.. మంచినీటి కలుషితమే ప్రధాన కారణం
- రక్తకణాలు తగ్గుతుండటంతో జ్వర పీడితుల ఆందోళన


ఉదయగిరిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 3: మారిన వాతావరణ పరిస్థితులతో విషజ్వరాలు నియోజవర్గంలో విజృంభించాయి. గ్రామాల్లో ఎక్కడ చూసినా జ్వరపీడుతులే కనిపిస్తున్నారు. కొందరికి రోజులతరబడి జ్వరం తగ్గక పోవడంతో శరీరంలో రక్తకణాల సంఖ్య తగ్గాయని వైద్యులు ధ్రువీకరించడంతో చెన్నై, నెల్లూరు వైద్యశాలలకు వెళ్లి చికిత్స పొంది నయం కావడంతో ఇంటికి చేరుకొన్నారు. ఉదయగిరి పట్టణంలోని సినిమాహాలువీధి, నాగులబావివీధికి చెందిన ఇద్దరు వ్యక్తులు జ్వరం బారినపడడంతో స్థానిక వైద్యశాలలో చికిత్స పొందారు. మరికొందరు జ్వరం తగ్గక నెల్లూరు, ఆత్మకూరు, వింజమూరు, కావలి ప్రాంతాల్లోని ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు.

● అధ్వానంగా పారిశుధ్యం..

అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారి తాగునీరు కలుషితమవుతోంది. ఈ నీటిని తాగి జనాలు పలు వ్యాధుల వ్యాప్తికి గురవుతున్నారు. కాలువల్లో పూడిక తీయక పోవడంతో మురుగు నీరు పొంగిపొర్లి ప్రధాన రహదారులపై నిల్వ చేరి దోమలకు నిలయంగా మారుతోంది. ఇంట్లో ఒకరిద్దరు జ్వరాల బారినపడితే మరికొందరు వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంట పాడు, వింజమూరు ప్రాంతాల్లో బాధితులు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి సెలైన్‌లు ఎక్కించుకుంటున్నారు. మరికొందరు ఆర్‌ఎంపీ వైద్యుల వద్ద చికిత్స పొందుతున్నారు. పంచాయతీ అధికారులు, వైద్యులు పరిసరాలు శుభ్రత, దోమతెరలను వాడాలని ప్రచారంతోనే సరిపెట్టుకొంటున్నారే తప్ప నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.


ఉదయగిరిలో మూలకు చేరిన ఫాగింగ్ యంత్రం

● దోమల నివారణ చర్యలేవీ ?

దోమల నివారణకు 143పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలు ప్రభుత్వం సరఫరా చేసింది. వీటిని ఉపయోగించేందుకు నిధులు లేకపోవడంతో అధికారులు సచివాలయాల్లో మూలన ఉంచారు. రెండు వేల జనాభా ఉన్న గ్రామానికి ఒకసారి ఫాగింగ్ చేయాలంటే కనీసం రూ.5వేలు వరకు ఖర్చవుతుంది. కొన్ని గ్రామాల్లో ఒకసారి మాత్రమే ఫాగింగ్ చేయగా చాలా పంచాయతీ ల్లో ఈ యంత్రాలు మూలకు చేరాయి. కొన్ని పంచాయతీల్లో వీటిని అట్టపెట్టెల్లో నుంచి బయటకు తీసిన పాపాన పోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వరికుంటపాడు, సెప్టెంబరు 3: గణేశ్వరాపురం పిల్లాపేరు వాగు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో ఏఎస్‌ఐ శ్రీనాథ్ మంగళవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాగులో నుంచి వ్యాపారులు ప్రతినిత్యం ఇసుకను అక్రమంగా సమీప గ్రామాలతో పాటు ప్రకాశం జిల్లా పామూరుకు తరలిస్తుండడంతోనే దాడులు నిర్వహించినట్లు సమాచారం.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అంనతసాగరం, సెప్టెంబరు 3: తమ సమస్యలను పరిష్కరించాలని మండలంలోని ఆశవర్కర్లు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనతరం వైద్యులు శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బలక్ష్మమ్మ, సాబిరా, అక్కమ్మ, సునీత, జయలక్ష్మి పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 3: మండలంలోని 17పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘంకు సంబంధించి రూ.52.25లక్షల టైడ్, రూ.34.83లక్షల అన్‌టైడ్ నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిధులను తాగునీరు, పారిశుధ్యం, రోడ్ల మరమ్మతులకు వినియోగిస్తామన్నారు.

ఇసుక తరలింపుపై ప్రత్యేక నిఘా

కలువాయి, సెప్టెంబరు 3: పెన్నానది ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేసినట్లు మంగళవారం తహసీల్దారు లీల సంజీవకుమారి తెలిపారు. ఒక బృందంలో ఇద్దరు వీఆర్వోలు, వీఆర్‌ఏ ఉంటారని చెప్పారు. వీరు రాత్రి సమయంలో ఇసుక రీచ్‌లపై నిఘా ఉంచుతారని తెలిపారు. ముఖ్యంగా తెలుగురాయపురం, రాజుపాలెంలో ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎక్కడ ఇసుకను అక్రమంగా తరలిస్తే వెంటనే వారు ఎస్‌ఐతో పాటు రెవెన్యూ ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తారన్నారు. మూడురోజుల ప్రకారం షిఫ్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తారని చెప్పారు.

మూతలు ఏర్పాటు చేయాలి

వింజమూరు, సెప్టెంబరు 3: పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి ఉన్న మురుగు కాలువలపై మూతలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్- మండపం మధ్యన ఉన్న మురు కాలువపై మూతలు లేనందువలన ప్రజలు ప్రమాదాకులకు గురి అవుతున్నట్లు చెబుతున్నారు. త్వరలో చెన్నకేశవ స్వామి తిరునాళ ఉన్నందున అంతలోపే సమస్యను పరిష్కరించాలంటున్నారు.

ఏఎస్‌ఐకి సన్మానం

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 3: స్థానిక పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ ఏ.శ్రీనివాసులు ఎస్‌ఐగా పదోన్నతి పొందడంతో మంగళవారం నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు, టీడీపీ నాయకులు సన్మానించి మిఠాయిలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తులసీరామ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్కూళ్లలో పవన్ జన్మదిన వేడుకలు

వరికుంటపాడు, సెప్టెంబరు 3: మండలంలోని పలు గ్రామాల పాఠశాలల్లో మంగళవారం జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. జనసేన, టీడీపీ నాయకులు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు పఠాన్ రసూల్, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి నాదిండ్ల రాజేంద్ర, ఏఎంసీ చైర్మన్ చిననాయబ్ రసూల్, దగ్గుపాటి రవి, కొత్తులూరి శివాజీ, మేడిద వెంకట్, బత్తుల ప్రవీణ్, మణి, వెంగళరాయుడు, మణికంఠ పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే చేపట్టండి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 3: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా వైద్యఆరోగ్య సిబ్బంది ప్రతిరోజూ ఇంటింటా లార్వా, జ్వర పీడితుల సర్వే చేపట్టి నివేదిక అందజేయాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాదికారి శివకల్పన సూచించారు. మంగళవారం స్థానిక పాత సామాజిక ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. జ్వరపీడితుల నుంచి రక్తనమూనాలను సేకరించాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. గర్భవతులు, బాలింతలకు పౌష్టి కాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకట సుబ్బయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్, ఆరోగ్య పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, చెన్నయ్య, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలని నిరసన



తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 3: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం ఏపీటీఎఫ్ నాయకులు నినాదాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడారు. సెప్టెంబరు 1వ తేదీ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చీకటిరోజు అన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ పెన్షన్ విధానాలను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే 117 జీవోను వెంటనే ఉపసంహరించుకోవడంతో పాటు ఐఆర్‌ను ప్రకటించి పీఆర్సీ కమిటీని నియమించాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు జహీర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు మండల ఏపీటీఎఫ్ నాయకులు షబ్బీర్, ఓబులేసు, షేక్‌ఎండీ ఖాజా, గౌస్, జిలానీ, మాధవరాజు, ఖాజాపీర్ మార్కేండేయులు, ఖాజాఅహ్మద్, నరసింహులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశుభ్రత..

మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతలపై అవగాహన


సీతారామపురం : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మస్తాన్‌వలి

సంగం, ఆగస్టు 3: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ అప్పాజీ ఆధ్వర్యంలో ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు మంగళవారం పాఠశాలల మరుగుదొడ్ల ఫొటోల అప్‌లోడ్‌పై ఎంఈవో -1,2లు జానకీరాం,మల్లయ్యలు అవగాహన కల్పించారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు వారానికి రెండురోజులు పాఠశాల మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఉదయగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలలో డొక్కా సీతమ్మ బడి భోజనం, మరుగుదొడ్ల నిర్వహణపై పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు పరిశీలించి యాప్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఎంఈవో-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. విద్యార్హతతో సంబంధం లేకుండా యువతీ, యువకులు తమ వయసును బట్టి 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు రాయవచ్చన్నారు.

మర్రిపాడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విద్యాకమిటీ చైర్మన్, హెచ్‌ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఎంఈఓ-1 జ్యోతి, -2 ధనలక్ష్మిలు సూచనలిఇచ్చారు. ప్రతి సోమ, గురువారాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లు, బుధ, శుక్రవారాల్లో ఎస్‌ఎంసీ సభ్యులు మరుగుదొడ్ల ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఈవోపీఆర్డీ మస్తాన్‌ఖాన్, రిసోర్స్‌పర్సన్ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, టాయిలెట్ మెయింటెనెన్స్‌లపై హెచ్‌ఎంలు, సచివాలయ సంక్షేమ సహాయకులు, ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లకు మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్‌వలి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భార్గవి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంఎస్‌లు శ్రీనివాసులు, కొండయ్య పాల్గొన్నారు.

చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి


ఆత్మకూరు: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నారాయణమ్మ

ఆత్మకూరు, సెప్టెంబరు 3: అంగన్‌వాడీకేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం తప్పని సరిగా అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నారాయణమ్మ తెలిపారు. మంగళవారం కరటంపాడు పంచాయతీలోని శ్రీనివాసపురం అంగన్‌వాడీకేంద్రంలో పౌష్టికాహారవారోత్సవాల సదస్సు నిర్వహించారు. కిషోరబాలికలకు సైతం పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. పాలు, గుడ్లు, బాలామృతం, బాల సంజీవనిలు ఉపయోగపడే పౌష్టికాహారమని వివరించారు. సర్పంచ్ రేవతి, హెచ్‌ఎం కొండారెడ్డి పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): నర్రవాడ సెక్టార్ పరిధిలోని వడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పుట్టినబిడ్డకు అరగంటలోపు ముర్రుపాలు తాపించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుహాసిని, శ్రీలక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలపై విజిలెన్స్ తనిఖీలు


కలువాయిలో వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ అధికారి వెంకటరెడ్డి

కలువాయి, సెప్టెంబరు 3: జగనన్న లేఅవుట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై మంగళవారం విజిలెన్స్ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. చెల్లించిన బిల్లులకు సంబంధించి, ఆన్‌లైన్‌లో ఉన్న సమాచారం ప్రకారం ఇంటి నిర్మాణం ఉందా.. లేదా ఉంటే ఏ దశలో ఉందో వారు వివరాలు సేకరించారు. మండలంలోని 16లేఅవుట్లలో 726 ఇళ్ల నిర్మాణం చేపట్టగా వాటిలో కాంట్రాక్టర్ 424, లబ్ధిదారులు 302 ఇళ్ల నిర్మించుకున్నారు. ప్రతి ఇంటి నిర్మాణంను పరిశీలించారు. వీటిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామని విజిలెన్స్ అధికారి వెంకటరెడ్డి తెలిపారు. వారి వెంట గృహనిర్మాణశాఖ ఆత్మకూరు డీఈ ముక్తార్ భాషా, కలువాయి ఇన్‌చార్జి ఏఈ మహే ష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ప్రవళిక, నాగరాజు ఉన్నారు.

ఏటి కాలువలో జమ్ము తొలగించండి


ఆత్మకూరు చెరువు కెనాల్‌ను పరిశీలనకు వచ్చిన రైతుసంఘం నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 3: స్థానిక చెరువుకు నీటిని సరఫరా చేసే ఏటి కాలువ మరమ్మతులు చేపట్టి, ఏపుగా పెరిగిన జమ్మును తొలిగించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం చెరువు కెనాల్‌ను ఆయన స్థానిక రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. గొల్లపల్లి వద్ద నుంచి బొగ్గేరు వాగు వరకు ఉన్న ఈ కాలువ అధ్వానంగా ఉండటంతో రైతులకు సాగునీరు అం దడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల నుంచి మరమ్మతులు చేపట్టకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇరిగేషన్ అధికా రులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం ఆత్మకూరు మండల అధ్యక్షుడు పాపిశెట్టి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కావలిలో క్షీణిస్తున్న

పారిశుధ్యం

- అధికారుల పర్యవేక్షణ కరువు



కోర్టు వెనుకవీధిలో చెల్లా చెదురుగా చెత్తా చెదారం

కావలి, సెప్టెంబరు 3: కావలి పట్టణంలో మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో పారిశుధ్యం క్షీణిస్తోంది. మున్సిపల్ పారిశుధ్య కార్మికులను లెక్కకుమించి మస్టర్లలో చూపిస్తున్నారే కానీ, విధుల్లోకి వచ్చేసరికి వారు కనిపించడం లేదు. దీనితో పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా మారింది. మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో ఉన్న కోర్టు వెనుకవీధిలో ఊడ్చకపోవడంతో చెత్తచెదారం రోడ్డంతా చెల్లా చెదురుగా పడి ఉంది. అసలే వైరల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న తరుణంలో పారిశుధ్యం క్షీణిస్తే రోగాలు మరింత ప్రబలే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వెంటనే పారిశుధ్య నిర్వహణ మెరుగుదలకు చర్యలు చేపట్టాలి.

ఆశా కార్యకర్తల సేవలు భేష్


గుడ్లూరు : మాట్లాడుతున్న డాక్టర్ మారుతీరావు

గుడ్లూరు, సెప్టెంబరు 3 : వైద్యశాఖలో ఆశా కార్యాకర్తలు ప్రజలకు అందిస్తున్న సేవలు మరువలేనివని డాక్టర్ మారుతీరావు అన్నారు. ఆశా డే సందర్భంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటి తిరిగి సర్వే చేసి ఈ పాటికే జ్వరాలు భారిన పడిన వారిని గుర్తించి వారికి ఇంటి దగ్గరే మందులు ఇవ్వాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో భాస్కరరావు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

బిట్రగుంట : వర్షాల కారణంగా వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుసేనమ్మ అన్నారు. మంగళవారం బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కలతో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు రాజశేఖర్, ప్రవీన్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ట్రేలలో నారు పెంపకంపై శిక్షణ


రైతులకు శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కందుకూరు, సెప్టెంబరు 3: ప్లాస్టిక్ ట్రేలలో కూరగాయలు, పూలనారు పెంపకంపై స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులు, మహిళా రైతులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ప్లాస్టిక్ ట్రేలలో కోకోపిట్ నింపడంతో పాటు నారుకు తెగుళ్ల సోకకుండా ట్రైకోడెర్మావిరిడి, సూడోమోనాస్ కలిపే విధానాన్ని, పురుగుల నియంత్రణను, పోషకాల యాజమాన్యంపై ప్రయోగాత్మకంగా చేయించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టరు జి.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ట్రేలలో నారుపెంచటం ద్వారా మొక్కలు ధృడంగా ఉండి పొలంలో నాటినప్పుడు త్వరగా నిలదొక్కుకుని రోగాలను తట్టుకుని అధిక దిగుబడినిస్తాయని తెలిపారు. కూరగాయలు, మిరప, పూలు లాంటి పంటలు సాగుచేసే రైతులు ఇంటివద్దనే నారు పెంచుకుని నాణ్యమైన నారును నాటుకోవటం ద్వారా ఖర్చు తగ్గించుకుని అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా కేవీకే దత్తత గ్రామాలైన పలుకూరు, పోకూరు, శాఖవరం రైతులకు మినుములో పల్లాకు తెగులును తట్టుకునే పాలిష్‌రకం అయిన ఎల్‌బీజీ 904 రకం విత్తనాన్ని ప్రదర్శనా క్షేత్రాల కింద ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టరు మయాంక్, డాక్టరు వెంకటేష్, డాక్టరు జ్యోతి, డాక్టరు నిహారిక, వివేక్, డాక్టరు శ్రీరంగ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు జీతాలు పెంచాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వద్ద ధర్నా


సీహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

లింగసముద్రం, సెప్టెంబరు 3 : ఆశా వర్కర్లకు జీతాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఎదుట ఆశా వర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఫిబ్రవరి 9వ తేదీన ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని గెజిట్లో పొందుపరిచిందని కానీ జీవోలు ఇవ్వలేదన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని, రూ.10 లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ ఇవ్వాలని, పదవీ విరమణ వయస్సు 62కు పెంచి, 5 లక్షలు బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. అనంతరం వారు సీహెచ్‌వో జి.శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు.

పోషక విలువలు ఉన్న పౌష్టికాహారం తీసుకోవాలి


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సునీత

వలేటివారిపాలెం, సెప్టెంబరు 3 : గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని చెర్లోపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం 7వ రాష్ట్రీయ పోషణ్ మాస్ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ తీసుకునే ఆహారంలో తృణధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, ఏఎన్‌ఎంలు రమాదేవి, వెంకటేశ్వరమ్మ, హైమావతి, అంగన్‌వాడీ కార్యకర్త సరళ పాల్గొన్నారు.

డీఎం చానల్ మరమ్మతులు పూర్తి


కాలువ వద్ద ఇసుక బస్తాలు వేస్తున్న కూలీలు

బిట్రగుంట, సెప్టెంబరు 3: బోగోలు మండలంలోని కడనూతల, కోవూరుపల్లి చెరువులు ఎండుతుండటంతో కావలి ఎమ్మెల్యే దుగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు మండల టీడీపీ నేతలు గత వారం రోజులుగా చేపట్టిన డీఎం చానల్ కాలువ తాత్కాలిక మరమ్మతు పనులు మంగళవారం పూర్తయ్యాయి. నాగులవరం నుంచి దెబ్బతిన్న కాలువ, కలుజు, తూములకు ఇసుక బస్తాలు వేసి నీరు వృథా కాకుండా కట్టుదిట్టం చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యంగా వదిలేసిన షటర్లు పూర్తిగా దెబ్బతినడంతో ప్రస్తుతానికి ఇసుక బస్తాలతో వాటికి అడ్డుకట్ట వేశారు. కావలి కాలువ నుంచి ఎస్వీపీఎం ద్వారా డీఎం చానల్ కాలువకు అనుసంధానం చేసి తాళ్లూరు మీదుగా సోమశిల జలాలను కడనూతల, కోవూరుపల్లి చెరువులకు అందించే విధంగా పనులు చేశారు. బుధవారం ఈ కాలువకు సోమశిల జలాలు విడుదల చేయవచ్చని తెలిసింది.

పరిశుభ్రతను పాటించండి

లింగసముద్రం, సెప్టెంబరు 3 : పాఠశాలల్లో పరిశుభ్రతను పాటించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంఈవో-2 శివకుమార్ అధ్యక్షతన పాఠశాలల్లో ఎస్‌ఎంసీ చైర్మన్లు, కాంప్లెక్స్ చైర్మన్లు, హెచ్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్లు ప్రతి సోమవారం వెల్ఫేర్ అసిస్టెంట్లు, ప్రతి గురువారం ఎస్‌ఎంసీ కమిటీ ఫొటోలు తీసి పంపించాలన్నారు. అలాగే కుకింగ్ ఏజెన్సీల వారు వంట గదులను శుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులు చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కొని భోజనం చేయాలన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణపై అవగాహన

కొండాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణపై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లకు మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం ఎంఈవో-1 కే.రవికుమార్, ఎంఈవో-2 ఆనందరావులు అవగాహన కల్పించారు. గతంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుండగా కూటమి ప్రభుత్వం ఆ బాధ్యతలను వారి నుంచి తొలగించి పాఠశాల యాజమాన్య కమిటీకి, స్థానిక సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు అప్పగించారన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ బుధ, శుక్రవారాలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సోమ, గురువారాలలో మరుగుదొడ్ల నిర్వహణను కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.బ్రహ్మయ్య, మండల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎస్‌ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

అర్చకుల జీతాల పెంపు హర్షణీయం


మాట్లాడుతున్న ఆదిశైవ అర్చకులు

కావలి, సెప్టెంబరు 3: అర్చకుల జీతాలను రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల పెంచటం హర్షణీయమని అర్చక సంఘం నాయకులు తెలిపారు. కావలి పాతూరు శివాలయం వద్ద మంగళవారం కావలి డివిజన్ అర్చక సంఘం నాయకుల సమావేశమై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డీడీఎన్ అర్చకుల జీతాలను 5 నుంచి 10 వేల రూపాయలకు, ఎండోమెంట్ దేవాలయాల అర్చకులకు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ఆదిశైవ బ్రాహ్మణ అర్చకసంఘం అధ్యక్షుడు కేకే శేషగిరి రావు, ప్రధానకార్యదర్శి గుడ్లూరు ఫణి కుమార్ శర్మ, కోశాధికారి ముదివర్తి రవికాంత్ శర్మ, నేతలు ఎన్.సుబ్బయ్య శాస్త్రి, శశిధర్‌గురుకుల్, శివకుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కావలిటౌన్, సెప్టెంబరు 3: ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మంగళవారం కళాశాలలో రక్తదానం చేశారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల రక్తనిధి సిబ్బంది రక్తం సేకరించారు. రక్తదాతలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుకర్, ఏవో రామకృష్ణ, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు చవల రామకృష్ణ, ఆత్మకూరి లక్ష్మి, పబ్బా సాయి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి : సీఐ

కావలి రూరల్, సెప్టెంబరు 3: వినాయక చవితి ఉత్సవాలకు పోలీసుల అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని కావలి 1వ పట్టణ సీఐ ఫిరోజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినాయకుడి విగ్రహం పెట్టదలచిన వారు అనుమతి కొరకు ఆన్‌లైన్‌ల్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసిన వారికి స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఎంత చలానా కట్టాలన్నది వారి రిజిస్టర్ మొబైల్ నెంబరుకు పేమెంట్ ఐడీ వస్తుందని పేర్కొన్నారు. అనంతరం మీ సేవకు వెళ్లి చలానా కట్టిన తరువాత అనుమతి ఇస్తామని పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కందుకూరు, సెప్టెంబరు 3: కందుకూరులో సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఇందూరి సాయి కుటుంబ సభ్యులకు టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు రూ.15వేల ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం ఆయన సాయి మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

గిరిజన కాలనీలో నీటి కష్టాలు

బిట్రగుంట, సెప్టెంబరు 3: బోగోలు మండలం బిట్రగుంట పంచాయతీ కొండబిట్రగుంట గిరిజనకాలనీలో 10 రోజులుగా తాగునీరు లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్న నీరు గిరిజనకాలనీ వాసులకు అందచేయడం లేదని అన్నారు. మండుటెండలో కూలీనాలికి వెళ్లి వచ్చి గుక్కెడు నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. కాలనీలో ఏర్పాటు చేసి ఉన్న ట్యాంకుకు పంపింగ్ చేసే బావిలో నీరు ఎండిపోవడం వలన తాగునీటి కష్టాలు పడుతున్నామని వారు తెలిపారు. అధికారులు స్పందించి తాగునీటి ఇక్కట్లు తీర్చాలని వారు కోరుతున్నారు.


కొండబిట్రగుంట గిరిజనకాలనీలో నిరుపయోగంగా ఉన్న ట్యాంకు

వాతావరణ మార్పులతో ఆందోళన

● తగ్గిన ధాన్యం ధరలు ● అన్నదాతల కంట కన్నీరు

● రైతులను దోచుకుంటున్న మిల్లర్లు ● ఆదుకోవాలని అధికారులకు మొర



కోవూరు మండలంలో వరి కోస్తున్న వరికోత యంత్రం

కోవూరు, సెప్టెంబరు 3: పండించిన ధాన్యం చేతికొచ్చేవేళ వర్షం కురుస్తుండటంతో రైతులు కంటతడి పెడుతున్నారు. పెన్నాడెల్టాలో వర్షాభావ పరిస్థితులను అధిగమించి రైతులు రెండోకారు (ఎడగారు) కింద కేఎస్ఎం 1638, 733 వరి రకాలను పండించారు. సాగునీటి కాలువల్లో నీరు అంతంత మాత్రంగా ఉన్నా, అత్యధిక ఉష్ణోగ్రతల్ని తట్టుకుని బోర్లపై ఆధారపడి పంట పండించారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని బుచ్చి, కోవూరు, కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట మండలాల్లో కేఎస్ఎం 1638 రకాన్ని పండించారు. బాగా పండిందని సంబరపడుతున్నవేళ వర్షాలు ప్రారంభమయ్యాయి. మారిన వాతావరణ పరిస్థితులు, వర్షం వల్ల ఎత్తు పెరిగిన పంట పలుచోట్ల నేలకొరిగింది. వారం కిందట పుట్టి ధాన్యం రూ.21,000లకు విక్రయించారు. రెండు రోజుల నుంచి వర్షం పడుతుండటంతో ధాన్యం ధర ఒక్కసారిగా రూ18,000లకు పడిపోయింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ధాన్యంలో తేమ ఉందనే సాకుతో దళారులు, మిల్లర్లు రైతులను దోచుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించమని రైతులు, రైతు సంఘాల నాయకులు జిల్లా అధికారులకు వినతిపత్రాలు సమర్పించుకున్నా ఫలితం లేకుండాపోయింది. తమ న్యాయమైన డిమాండును అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.



గిట్టుబాటు ధర కల్పించాలి

పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. ప్రతీ ఏటా పంట దిగుబడి చేతికి వచ్చాక ధాన్యం ధర చూస్తే కడుపుకోత మిగులుతోంది. చేతికొచ్చిన పంట అమ్మేసమయంలో ధరలు పడిపోతున్నాయి. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. లేకుంటే తీవ్రంగా నష్టపోతాం

- పునుగుంట రామకృష్ణారెడ్డి, రైతు, కోవూరు

తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలి



ఈ దఫా పంట బాగా పండింది. తీరా పంట చేతికొచ్చే సమయానికి వాతావరణం మారిపోయింది. దీంతో ధర తగ్గింది. అధికారులు చొరవ చూపి ధాన్యం ధరలు తగ్గకుండా చర్యలు తీసుకోవాలి.

-చింతపంటి సుధాకర్, రైతు, విడవలూరు

పంచాయతీ స్థలాలు ఖాళీ చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు3: నగర పంచాయతీలోని స్థలాల్లో నివసించేవారు వెంటనే ఖాళీ చేయాలని కమిషనర్ ఎల్. చంద్రశేఖర్‌రెడ్డి పందుల పెంపకందారులను, ఇతరులను హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి ఇళ్ల స్థలాలు లేనివారికి తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తామన్నారు.

'మా స్థలం కబ్జా చేసి మాపైనే దౌర్జన్యం'

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు3: తమ సామాజికవర్గానికి చెందిన కొంతస్థలాన్ని సమీపంలోని దళితవాడకు చెందిన ఓ వ్యక్తి కబ్జా చేసి, తమపైనే దౌర్జన్యం చేస్తున్నారని ఇస్కపాళెం అరుంధతీవాడ వాసులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు మంగళవారం ఆయనకు వినతిపత్రం అందచేశారు. స్థలం కబ్జాచేసి నకిలీ రాజముద్రతో రిజిస్ట్రేషన్లు చేయించారని, విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. స్థలాలను పరిశీలించి, రాజముద్రలు నకిలీవైతే చర్యలు చేపడతామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు. స్థల పరిశీలనలో దళితవాడకు చెందిన బొమ్మిరాము, ఎన్. రమేష్, సుధాకర్, బీ వెంకటేశ్వర్లు, రమణయ్య, లక్ష్మమ్మ, విజయమ్మ, శేషమ్మ తదితరులు ఉన్నారు.

జాతీయ నేత్రదాన పక్షోత్సవాలపై అవగాహన ర్యాలీ

ఇందుకూరుపేట, సెప్టెంబరు 3: మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీలో మంగళవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో ఆయన మాట్లాడుతూ దేశంలో సుమారు 12 లక్షల మంది కార్నియల్ అంధత్వంతో బాధపడుతున్నారని తెలిపారు. వారిలో 60 శాతం మంది 30ఏళ్లలోపే వారే ఉన్నారని తెలిపారు. నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు కంటిచూపును ప్రసాదించవచ్చన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ మరణానంతరం 6 నుంచి 8 గంటల వ్యవధిలో నేత్రాలు సేకరించవచ్చన్నారు. నేత్రదానం చేయాలనుకునేవారు ముందుగా ప్రతిజ్ఞ పత్రం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ హైమావతి, రమా, సతీష్‌బాబు, వైద్య సిబ్బంది, ఆశా వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆఫీసులుగా ప్రభుత్వ కార్యాలయాలు : కాకాణి

పొదలకూరు, సెప్టెంబరు 3 : టీడీపీ అధికారంలోకి వచ్చాక సర్వేపల్లిలోని రెవెన్యూ, పోలీస్‌స్టేషన్ కార్యాలయాలు టీడీపీ ఆఫీసులుగా మారాయని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్ వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన నిరసనలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ రైతుల భూముల విషయంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. జిల్లాలో పనిచేసే కలెక్టర్, ఎస్పీలు నిజాయితీపరులైతే సోమిరెడ్డి ఇంటిపై దాడి చేయించి, ఎవరి ఎవరి దగ్గర ఎంత వసూలు చేశారో లెక్కాపక్కా చూస్తే సోమిరెడ్డి అవినీతి బయటపడుతోందన్నారు. అసలు అవినీతిపరులను వదిలేసి వైసీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు.

'హద్దురాళ్లు తొలగించాలి'

విడవలూరు, సెప్టెంబరు 3 : ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్ల మధ్య వేసిన హద్దురాళ్లను తొలగించాలని ఊటుకూరు పంచాయతీ గొల్లపాలెంవాసులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దారు భానుప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సుమారు 50ఏళ్లుగా గొల్లపాలెంలో నివాసం ఉంటున్నామని,తమ కాలనీ చుట్టు పక్కల ప్రాంతాల్లో వరదనీటి కాలువలున్నాయని, అవి మాకు చాలా దూరంగా ఉన్నాయన్నారు. ఆ కాలువల వల్ల మా ప్రాంతానికి ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. అయితే ఇటీవల సర్వే చేసి హద్దు రాళ్లు వేశారన్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి హద్దురాళ్లను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీ.సుధ, బండారు శివకుమార్, ఎల్లంటి సుబ్బయ్య, గండి గంగాధర్, యానాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో కోడి వ్యర్థాల వాహనం

విడవలూరు, సెప్టెంబరు 3 : మండలంలో నిబంధనలకు విరుద్ధంగా కోడి వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని ముదివర్తి గ్రామసమీపంలో పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సాయిప్రసాద్ తెలిపారు.

మండపాల వద్ద నిబంధనలు తప్పనిసరి



సైదాపురం : వినాయక మండపాల వద్ద నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించి మాట్లాడారు. ఆన్‌లైన్ ద్వారా వివరాలు తెలియపరచాలని తెలిపారు. మండలంలో ప్రస్తుతం 8మంది ఆన్‌లైన్‌లో వివరాలు తెలిపారన్నారు. ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అనంతరం రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయన వెంట ఎస్ఐ కాంతికుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

విడవలూరు, సెప్టెంబరు 3: నియోజకవర్గంలోని రైతుల సంక్షేమమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. వీపీఆర్ ట్రస్ట్ ద్వారా సొంత నిధులతో వీరారెడ్డిపాలెంలోని కడిదేవి ఇరిగేషన్, డ్రెయిన్ కాలువ పూడికతీత పనులను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడిదేవి కాలువ పూడికతీత పనులు పూర్తయితే రామతీర్థం, రామచంద్రాపురం, వీరారెడ్డిపాలెం రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలనే ధ్యేయంతో వీపీఆర్ ట్రస్ట్ ద్వారా సొంత నిధులతో కాలువల మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మండలంలో పలు కాలువలను తవ్విస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, అడపాల శ్రీధర్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, మాతూరి శ్రీనివాసులురెడ్డి, రాజన్న, తుళ్లూరు మాధవ్, తాతా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాకాణి భూ దాహానికి తహసీల్దార్లు బలి : టీడీపీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పొదలకూరు, సెప్టెంబరు 3 : మాజీ మంత్రి కాకాణి భూదాహానికి అప్పటి తహసీల్దార్లు బలయ్యారని, మరికొందరు బలికాబోతున్నారని మండల టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కాకాణి మంత్రిగా ఉన్న సమయంలో రూ.కోట్ల విలువైన మరుపూరులోని ప్రభుత్వ భూములను ఏఆర్బీలో అప్రూవల్ కాకుండా, 60 మందికి తహసీల్దారు సంతకాలతో పట్టాలు సృష్టించారన్నారు. ఈ 60 పట్టాలు గ్రామంలో అంతకుముందు భూములు ఉన్నవారికి, ధనికుల పేర్లతో ఉన్నాయన్నారు. గతంలో ఇలాంటి భూ కుంభకోణాలకు పాల్పడి సస్పెండ్ అయిన స్వాతికి కాకాణి అవినీతి, అక్రమాలతో భాగస్వామ్యం ఉందన్నారు. మంత్రి కాకాణికి తెలిసినట్లుగా పోలీసులు వాడుకోవడం తమకు తెలియదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, పల్లారపు కృష్ణ, బోగోలు భాస్కర్‌రెడ్డి, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షిరిడీ తరహాలో గొలగమూడి అభివృద్ధి

● ఈవోపై అసత్య ఆరోపణలు తగదు ● వెంకయ్యస్వామి ఆశ్రమ సేవకులు



విలేకరులతో మాట్లాడుతున్న ఆశ్రమ సేవకులు, ఉభయకర్తలు, తదితరులు

వెంకటాచలం, సెప్టెంబరు 3: గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమాన్ని షిరిడీ తరహాలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకుని, కృషి చేస్తున్న ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యంపై కొందరు అసత్య ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని వెంకయ్యస్వామి సేవకులు, ఉభయకర్తలు, ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఆరాధన సమయంలో తాము వెంకయ్యస్వామి బంధువులమని చెప్పుకొని, కొందరు నానా హంగామా సృష్టించారని తెలిపారు. ఎలాంటి జీతభత్యాలు తీసుకోకుండా 18 ఏళ్లుగా వెంకయ్యస్వామిపై ఉన్న విశ్వాసంతో ఈవోగా పనిచేస్తున్న బాలసుబ్రహ్మణ్యంపై అసత్యఆరోపణలు, నిందలు వేయడం మంచికాదన్నారు. ఇన్నేళ్లుగా కనిపించని వారు మొన్నటి ఆరాధనకు వచ్చి ఇలా చేయడం మంచికాదన్నారు. కేవలం డబ్బుల కోసమే ఇక్కడికి వచ్చి అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. భగవంతుడి ఎదుట అందరూ సమానమేనని, ఇక్కనైనా వారు ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు.

గిరిజనులకు అన్యాయం చేసిన వైసీపీ : జనసేన



గిరిజనులకు అన్నదానం చేస్తున్న జనసేన నాయకుడు సురేష్, తదితరులు

ముత్తుకూరు, సెప్టెంబరు 3: వైసీపీ ప్రభుత్వం హయాంలో గిరిజనులకు తీవ్రఅన్యాయం జరిగిందని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. మండలంలోని దేవరదిబ్బ గిరిజనులకు డొక్కా సీతమ్మ స్ఫూర్తితో మంగళవారం అన్నదానం చేశారు. ఇప్పటికీ సొంత ఇళ్లులేక, పిల్లలకి ఒంటినిండా దుస్తులు లేక దేవరదిబ్బ గిరిజనులు యాష్‌పాండ్ నుంచి వచ్చే బూడిదగాలికి చర్మ వ్యాధులతో అల్లాడిపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వారికి పునరావాసం కల్పించేందుకు గ్రామాన్ని తరలించడం, వాళ్లకి ఉచితంగా వైద్యాన్ని అందించిన పరిస్థితి కూడా లేదన్నారు. గ్రామాన్ని తరలించి వారిని అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో వీర మహిళ కావలి కవిత, మండల సీనియర్ నాయకులు రహీం, బోళ్ల అశోక్, మస్తాన్, సుమన్, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు, యూనిఫాంల పంపిణీ

రాపూరు, సెప్టెంబరు 3: స్థానిక శ్రీకరుణామయి స్కూల్ విద్యార్థులకు మంగళవారం మాతృదేవి విద్యాశాంతి ఆశ్రమ ట్రస్టు నిర్వాహకులు విజయభరత్ స్కూల్ బాగ్స్, యూనిఫాం, షూస్, డైరీస్, బెల్ట్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకరయ్య మాట్లాడారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అన్ని తరగతుల విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణులైనవారికే విద్యాలయంలో ప్రవేశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీవీటీఎస్ ఉష, ఉమా, ప్రిన్సిపాల్ వెంకటరాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోండి

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలో రెండవ పంటకు సంబంధించి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి డీఆర్వో లవన్నకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. కేఎస్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048 రకాలకు పుట్టి ధర రూ.18వేలకు పడిపోయిందని, వ్యాపారులు ధరలు తగ్గించి కొంటున్నారని, రైతులు నష్టపోకుండా గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



కుంగిన నెక్లెస్‌రోడ్డు



నెర్రెలు బారిన నెక్లెస్ రోడ్డు

గణేష్ ఘాట్‌లో నాసిరకం పనులు

● పైగా నత్తనడక ● 7 నుంచి చవితి ఉత్సవాలు ● నిమజ్జనంలోపు పూర్తయ్యేనా?

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 3 : వినాయక చవితికి ఇక మూడు రోజులే ఉంది. ఈ నెల 7వ తేదీనా ఆ పండుగను అందరూ ఘనంగా జరుపుకుంటారు. ఆరోజు నుంచే గణేష్ నిమజ్జనానికి అనువుగా స్వర్ణాల చెరువులోని గణేష్ ఘాట్‌లో ఏర్పాట్లు పూర్తిచేయాలని దాదాపు 20 రోజుల కిందట పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ తదితరులు నగర పాలక సంస్థకు సూచించారు. ప్రస్తుతం ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద ఘాట్‌లో జరుగుతున్న ఏర్పాట్లు చూసిన వారికి మంత్రి మాటలు నీటిమూటలేనని అనిపిస్తుంది. ఘాట్ వద్ద 3వరోడ్డు నిర్మాణంతో కలిపి దాదాపు రూ.కోటి పనులను ప్రారంభించారు. కానీ ఆ పనులు నత్తనడకన అదీ నాసిరకంగా సాగుతున్నాయి.

వ్యర్థాలు తొలగించలేదు

వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే స్వర్ణాల చెరువులో గుర్రపు డెక్కాకును అయితే తొలగించారు గానీ చెరువుగట్టు వెంబడి పేరుకు పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రం తొలగించలేదు. నగర పాలక సంస్థ నిర్లక్ష్యం కారణంగా చెరువుకట్టపై నిర్మించిన నెక్లెస్‌రోడ్డు పగుళ్లు బారింది. కొన్నిచోట్ల కుంగిపోయి ప్రమాదభరితంగా మారింది. రోడ్డుపై నెర్రెలు పూడ్చేందుకు నాసిరకంగా తారుపోశారు. దీంతో తారు పక్కకి వెళ్లి రోడ్డు గతుకులు అలాగే మిగిలాయి. ఘాట్‌లో దెబ్బతిన్న మెట్ల మరమ్మతులు కూడా వినాయక చవితి నాటికి



ఘాట్‌లో జరుగుతున్న మెట్ల మరమ్మతులు

పూర్తయ్యేలా కనిపించడం లేదు. ఇక్కడి పనులకు వాడుతున్న నిర్మాణ సామగ్రి కూడా నాసిరకంగా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘాట్‌లో నిమజ్జనం ఏర్పాట్లు చూద్దామని వచ్చే నగరవాసులు అక్కడ జరుగుతున్న పనులు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా, నిమజ్జనం నాటికి విగ్రహాలు మునిగిపోయే మేర చెరువుకు నీటి మట్టం పెంచాల్సిన అవసరం ఉంది.



గణేష్ ఘాట్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నిమజ్జనానికి పటిష్ట భద్రత: ఎస్పీ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 3: ఈనెల 7వతేదీ నుంచి జరిగే వినాయక చవితి ఉత్సవాలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశించారు. మంగళవారం ఆయన ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి సమీపంలో ఉన్న గణేష్ నిమజ్జన ఘాట్‌లో విగ్రహ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నీటిలోతు, నిమజ్జనం చేసే ప్రదేశాలు, ప్రవేశం, నిష్క్రమణ దారులు, బారికేడింగ్, ట్రాఫిక్ తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, ముఖ్యంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. నిమజ్జనం ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు ఉత్సవ కమిటీలు సహకరించా లని కోరారు. ఈ కార్యక్రమంలో నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, చిన్నబజారు, సౌత్, నార్త్ ట్రాఫిక్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరావు, వెంకటరెడ్డి, రామకృష్ణ, నాగేశ్వరమ్మ, ఉత్సవ కమిటీనిర్వాహకులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నాయకుల వలస



వెల్లంటి ఎంపీటీసీని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 3 : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అధికార టీడీపీలో చేరేందుకు వైసీపీ నాయకులు క్యూ కడుతున్నారు. పార్టీలో చేరికకు ఎమ్మెల్యే కోటంరెడ్డి సోదరులు ద్వారాలు తెరవడంతో మంగళవారం మండలంలోని కొత్తవెల్లంటి ఎంపీటీసీ దేవసేనమ్మ దంపతులు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజాప్రతినిధులకు గౌరవం ఉండేది కాదన్నారు. అటు సంక్షేమం, ఇటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్లగలిగిన వ్యక్తి చంద్రబాబు ఒక్కడేనని స్పష్టం చేశారు. కాగా, నగరంలోని 1,2 డివిజన్ల కార్పొరేటర్లు జానా నాగరాజు, పడిగినేటి రామ్మోహన్ కూడా ఎమ్మె ల్యేను సంప్రదించి పార్టీలో చేరికకు అనుమతి కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, బెళ్లం శ్రీనివాసులురెడ్డి, జనపాల వెంకటరమణారెడ్డి, కుండా మురళీ రెడ్డి, కైపు ఆదిత్యరెడ్డి, పరంధామరెడ్డి పాల్గొన్నారు.

1008 చీరలతో కన్యకాపరమేశ్వరికి అర్చన

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 3 : నగరంలో స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా 1008 చీరలతో సహస్ర నామార్చన వైభవంగా అలంకారం జరిగింది. శ్రావణ మాసం ముగింపు ఉత్సవాలలో భాగంగా ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు వారాహి అమ్మవారి పూజ చేశారు. ఉదయం అభిషేకాలు, అలంకారంతోపాటు మూలవరులకు విశేష పూజలు జరిగాయి. సాయంత్రం 108 మంది మహిళలకు పసుపు కుంకుమ, జాకెట్లు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, ధర్మకర్తలు, ఉభయకర్తలు, ప్రధాన అర్చకుడు లలితా శివకుమార్ స్వామి పర్యవేక్షించారు.



1008 చీరలతో వాసవీ కన్యకాపరమేశ్వరి అలంకారం

వరద బాధితులను ఆదుకోవటంలో చంద్రబాబు కృషి ప్రశంసనీయం

● టీడీపీ సాధికారత కమిటీ కన్వీనర్ కృష్ణ

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 3 : రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి ప్రశంసనీయమని నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ సాధికార సమితి కన్వీనర్ కేసీ కృష్ణ అన్నారు. మంగళవారం చిల్డ్రన్స్ పార్క్ వద్ద ఉన్న టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి 74 ఏళ్ల వయసులోనూ రాత్రుళ్లు ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ వరద బాధితులను ఆదుకుంటున్నా రన్నారు. మంత్రి నారాయణ కూడా విజయవాడ వరద బాధితులకు సహాయం చేస్తున్నారని చెప్పారు. అయితే మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వరద బాధితులను పరామర్శిస్తూ వెకిలి చేష్టలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో బాలయ్యసైన్యం జిల్లా కన్వీనర్ వై రవి, టీడీపీ నాయకులు నారా శ్రీనివాసులు నాయుడు, సర్వేపల్లి సునీల్ నాయుడు, ధరణికుమార్ పాల్గొన్నారు.

17న ఏపీఈజేయూ జిల్లా మహాసభ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 3 : ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీఈజేయూ) నెల్లూరు జిల్లా 4వ మహాసభ ఈ నెల 17వతేదీ టౌనుహాలులో నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ అధ్యక్షుడు ఉడత రామకృష్ణ తెలిపారు. నగరంలో స్థానిక మహబూబ్ ఖాన్ పార్కులోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలను విజయవంతం చేయాలని, సభకు ముందు నిర్వహించే సభ్యత్వ నమోదులో అందరూ పాల్గొనాలని కోరారు. అదేరోజు మధ్యాహ్నం యూనియన్ జిల్లా కమిటీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కో కన్వీనర్ గట్టుపల్లి శివకుమార్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు వెలసిరి కుమార్, రాష్ట్ర నాయకులు పీజే రమేష్‌రెడ్డి, ఎస్‌డీ జావిద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పెన్షన్ భవన్‌లో గురుపూజోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 3 : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో గురువారం నగరంలోని భక్తవత్సలనగర్ పెన్షన్ భవన్‌లో జిల్లాస్థాయి గురుపూజో త్సవం నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం గౌస్‌బాషా, ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీఎన్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధ్యాయ వృత్తిలో విశేష కృషి చేసిన విశ్రాంత ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా జిల్లా ట్రెజరీ అకౌంట్స్ అధికారి డీ గంగాద్రి, సంఘం గౌరవాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, సహాయ సబ్ ట్రెజరీ అధికారి షేక్ అహ్మద్‌లు పాల్గొంటున్నారని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పెన్షనర్స్ అందరూ హాజరుకావాలని కోరారు.

ఐటీఐ అభ్యర్థులకు రేపు ఇంటర్వ్యూలు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 3 : ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్‌లో కోర్సు పూర్తి చేసిన వారికి పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు నగరంలోని కొత్తూరు వద్దనున్న ఎస్ఆర్ఆర్ ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ ఎస్‌పీ రెహమాన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం తమ కళాశాలలో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. 18 నుంచి 22 మధ్య వయసు కలిగి, అర్హత, ఆసక్తి ఉన్న వారు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, మూడు ఫొటోలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన వారికి రూ. 14,500 స్టైఫండ్‌గా లభిస్తుందన్నారు.

'స్విమ్స్'లో పింఛన్ అందచేత

నెల్లూరు (సిటీ): నగరంలోని ఇరగాళమ్మ సంఘం వద్దనున్న రాజీవ్ గృహ కల్పలో నివాస ముంటున్న అన్నంగి శ్రీనివా సులు కిడ్నీ వ్యాధి తో బాధపడు తూ తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతుండగా అతనికి మంగళ వారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ రూ. 6 వేలు నగదును స్థానిక సచివాలయ కార్యదర్శి సప్రం వెంకటేష్ అందిం చారు. శ్రీనివాసులు పింఛన్ తీసుకునేందుకు నెల్లూరుకు రాలేని స్థితిలో ఉండటంతో సమాచారం అందుకున్న సచివాలయ కార్యదర్శి స్విమ్స్‌కు వెళ్లి పింఛన్ నగదును అందించారు.

ప్రతి 10రోజులకు మహిళా దర్బార్

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలో మహిళల సమస్యలపై ప్రతి 10 రోజులకు మహిళా దర్బార్ నిర్వహించి, మంత్రి నారాయణ ద్వారా ఆ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని టీడీపీ బీసీ పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు కప్పిర శ్రీనివాసులు, మహిళా నాయకురాలు రేవతి తెలిపారు. మంగళవారం రంగనాయకులపేట పినాకినీ పార్కులో జరుగుతున్న జంగిల్‌క్లీనింగ్ పనులను వారు పరిశీలించారు. జగన్ ప్రభుత్వ హయాంలో పినాకినీ పార్కుని అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మార్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో పినాకినీ పార్కు అభివృద్ధితో పాటు పెన్నానదికి కరకట్ట నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. కృష్ణా వరదల్లో జగన్ విమర్శలు సిగ్గుచేటన్నారు.

పాఠశాలల శుభ్రత ఆయాలకే అప్పగించాలి

నెల్లూరు (విద్య): ప్రభుత్వ పాఠశాలలు, వాటిలోని మరుగుదొడ్ల శుభ్రత బాధ్యతను ఆయాలకే అప్పగించాలని బీటీఏ నేతలు కోరారు. నెల్లూరు రూరల్ పరిధిలోని పాత వెల్లంటి, ఆమంచర్ల, పొట్టేపాళెం, దేవర పాళెం కాంప్లెక్సుల పరిధిలోని పాఠశాలల్లో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మణి సుబ్బు మాట్లాడుతూ పాఠశాలల అభి వృద్ధికి గౌరవప్రదంగా ఎన్నుకున్న ఎస్ఎంసీ సభ్యులకు మరుగుదొడ్ల బాధ్యత అప్పగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్, నేతలు హనీఫ్ బాబు, సంపత్, ఖాజా రహంతుల్లా, రవి, హరి పాల్గొన్నారు.

సీడీపీవో సేవలు ఘనం

నెల్లూరు(హరనాథపురం): అర్బన్ సీడీపీవో అన్నపూర్ణ సేవలు ఘనమైనవని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ కొనియాడారు. మంగళవారం అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. పీడీ మాట్లాడుతూ అంగన్‌వాడీల పనితీరును మెరుగుపరిచేందుకు అన్నపూర్ణ ఎంతో కృషి చేశారన్నారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు సత్కారం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 3 : ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ గోవింద్‌ను మంగళవారం యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సత్కరించింది. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగాధర్, యూనియన్ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్, జిల్లా కార్యదర్శి షేక్ సందానీబాషా, కమ్మటి శ్రీనివాసులు, జబ్బార్, గోవిందరెడ్డి, భాస్కర్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నైతికతే నిజమైన స్వేచ్ఛ

● జమా అతె ఇస్లామీ హింద్ కన్వీనర్ అమీరా

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 3 : నైతికతే నిజమైన స్వేచ్ఛ అని, ఈ ఉద్యమంలో అందరూ భాగస్వాములుకావాలని జమా అతె ఇస్లామీ హింద్ నెల్లూరు నగర శాఖ మహిళా విభాగం కన్వీనర్ అమీరా పిలుపునిచ్చారు. మంగళవారం ఆ సంస్థ నగర కార్యాలయంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 30వతేదీ వరకు ఈ ఉద్యమం దేశ వ్యాప్తంగా జరుగుతుందని తెలిపారు. నేటి యువత స్వేచ్ఛ పేరుతో భవిష్యత్‌ను కోల్పోవడమేకాక సమాజాన్ని ప్రమాదంలో పడవేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళాబాధ్యులు సయ్యద్ అయేషా ఖాతున్ మాట్లాడుతూ అందరిలో మానవత్వం ఉంటుంది, దానిని అందరికీ పంచాలన్న విషయాన్ని ఈ ఉద్యమం ద్వారా ప్రచారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లికా బేగం, ఆసియా, వహిదాబేగం, గౌహర్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి పాలనలో తిరుపతి జిల్లాలో భూందాం వ్యవహారాలు జోరుగానే సాగినట్లు ప్రభుత్వం మారాక వెలుగులోకి వస్తున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. పేదలకు, ఇతర కొన్ని వర్గాలకూ ప్రభుత్వం ఇచ్చిన భూములను అధికారం చేతిలో ఉండడంతో పెద్దఎత్తునే కొల్లగొట్టినట్లు చెబుతున్నారు. అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్‌గా మార్చిన తీరు అనేక అనుమానాలకు దారితీస్తోంది.జిల్లాలో శ్రీకాళహస్తి ప్రాంతం ఈ ఫ్రీహోల్డ్ వ్యవహారాల్లో అగ్రస్థానంలో ఉంది. అప్పటి ప్రధాన నాయకుడు, అధికారులు కలిసి భారీగానే వ్యవహారాలు నడిపినట్లు ప్రచారం అవుతోంది. ఫ్రీహోల్డ్ భూములపై రాష్ట్రవ్యాప్తంగా విచారణ జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో జరిగిన భాగోతాలూ వెలుగు చూస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఫ్రీహోల్డ్ పేరుతో భారీగా భోంచేశారు!

- పేదల నోరుకొట్టి.. భూములు కొల్లగొట్టి..
- వెలుగులోకి వస్తున్న జగన్‌రెడ్డి పాలనలోని బాగోతాలు
- శ్రీకాళహస్తి ప్రాంతంలోనే అక్రమాలు అధికం

జిల్లాలో 44,526 ఎకరాలు ఫ్రీహోల్డ్

గత ప్రభుత్వంలో జిల్లావ్యాప్తంగా 44,526 ఎకరాల అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ చేశారు. అంటే పేదలకూ, ఇతర వర్గాలకూ ప్రభుత్వం ఇచ్చిన భూములపై సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించడం అన్నమాట. ఎటువంటి ఆటంకమూ లేకుండా ఈ భూములను అమ్ముకోవచ్చు, కొనవచ్చు. ఆ మేరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. ఇలా ఫ్రీహోల్డ్ అయిన భూముల ధరలు అమాంతం పెరిగిపోతాయి. ఇది అప్పటి నాయకులకూ, అధికారులకూ కోట్లు పోగేసిందని అంటున్నారు. రెవిన్యూ డివిజన్ల వారీగా చూస్తే శ్రీకాళహస్తి, గూడూరు డివిజన్లలో అత్యధికంగా అసైన్డ్ భూములు ఫ్రీ హోల్డ్ అయ్యాయి. శ్రీకాళహస్తి డివిజన్‌లో 15,647 ఎకరాలు ఫ్రీ హోల్డ్ కాగా గూడూరు డివిజన్‌లో 15,198 ఎకరాలు, తిరుపతి డివిజన్‌లో 7,611 ఎకరాలు, సూళ్ళూరుపేట డివిజన్‌లో 6069 ఎకరాలు వంతున అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేశారు. మండలాల వారీగా చూస్తే బాలాయపల్లిలో అత్యధికంగా 7548 ఎకరాలు ఫ్రీ హోల్డ్ చేయగా, శ్రీకాళహస్తి మండలంలో 7,402ఎకరాలు ఫ్రీ హోల్డ్ చేయడం గమనార్హం.

మండలాలవారీగా ఫ్రీహోల్డ్ అయిన తీరు

మండలం	ఎకరాలు
బాలాయపల్లి	7548
శ్రీకాళహస్తి	7402
కేవీబీపురం	3512
ఎర్రావారిపాలెం	3121
డక్కిలి	2313
గూడూరు	1873
తొట్టంబేడు	1873
ఏర్పేడు	1725
కోట	1608
తడ	1363
పెళ్ళకూరు	1139
నాయుడుపేట	1078
చంద్రగిరి	1021
ఆర్సీపురం	986
చిల్లకూరు	942
డీవీ సత్రం	834
ఓజిలి	760
పుత్తూరు	727
చిట్టమూరు	677
వడమాలపేట	648
పాకాల	616
సూళ్ళూరుపేట	540
చిన్నగొట్టిగల్లు	460
నారాయణవనం	424
పిచ్చాటూరు	387
రేణిగుంట	310
వరదయ్యపాలెం	155
వెంకటగిరి	118
వాకాడు	116
బీఎన్ కండ్రిగ	102
సత్యవేడు	95
తిరుపతి రూరల్	28
నాగలాపురం	11
మొత్తం	44526

1105 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు

జిల్లాలో ఫ్రీహోల్డ్ చేసిన అసైన్డ్ భూముల అమ్మకాలు, కొనుగోళ్లు ఆగమేఘాల మీద జరిగిపోవడం మొదలైంది. ఇప్పటికే 1105 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అధికార యంత్రాంగం గుర్తించింది. వీటిల్లోనూ అత్యధికంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రిజిస్ట్రేషన్లు జరిగినట్లు వెల్లడైంది. శ్రీకాళహస్తి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 453 ఎకరాలకు, తొట్టంబేడు కార్యాలయంలో 209 ఎకరాలకు, రేణిగుంట కార్యాలయంలో 17 ఎకరాలకు చొప్పున ఈ నియోజకవర్గంలో మొత్తం 679 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. తర్వాతి స్థానంలో చంద్రగిరి నియోజకవర్గం నిలిచింది. పాకాల కార్యాలయంలో 159 ఎకరాలు, చిన్నగొట్టిగల్లు కార్యాలయంలో 79 ఎకరాలు, చంద్రగిరి కార్యాలయంలో 72 ఎకరాలు, తిరుపతి రూరల్ కార్యాలయంలో 5 ఎకరాల చొప్పున ఈ నియోజకవర్గంలో మొత్తం 316 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు చేశారు. పుత్తూరు కార్యాలయంలో 92 ఎకరాలకు, పిచ్చాటూరు కార్యాలయంలో 9 ఎకరాలకు, సత్యవేడు కార్యాలయంలో 5 ఎకరాలకు చొప్పున రిజిస్ట్రేషన్లు జరిగాయి.

శ్రీకాళహస్తిపై ప్రత్యేక దృష్టి

జిల్లా మొత్తంలో అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయడం, వాటిని రిజిస్టర్ చేయడం రెండూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనే ఎక్కువగా జరిగాయి. 7400 ఎకరాలకు పైగా అసైన్ చేసిన భూములను ఇక్కడి అధికారులు ఫ్రీ హోల్డ్ చేయగా అందులో 679 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. ఈ స్థాయిలో సంబంధిత ప్రక్రియ మరే మండలంలోనూ జరగలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడి ముఖ్యనేత ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు పెద్దఎత్తున ఆక్రమించారని, ఇతరులకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నారని ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో రేణిగుంట, ఏర్పేడు తదితర మండలాల్లో పనిచేసిన రెవిన్యూ అధికారులు ముఖ్యనేతకు సహకరించి ఆ నేతతో సమానంగా రూ. కోట్లు పోగేసుకున్నారని తీవ్రస్థాయి ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చాయి. ఇద్దరు అధికారులపై బదిలీ వేటు పడడంతో పాటు ఓ అధికారిపై ఏసీబీ కేసు సైతం నమోదైంది. ఈ కారణంగా ప్రస్తుత ప్రభుత్వం ఈ నియోజకవర్గంపై ప్రధానంగా దృష్టి సారించింది. ప్రయోగాత్మకంగా శ్రీకాళహస్తి మండలంలో ఫ్రీ హోల్డ్ భూములపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన జరపాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. అక్కడ అక్రమాలు జరిగినట్టు తేలితే జిల్లా అంతటా పరిశీలించాలని నిర్ణయించింది. అందులో భాగంగా శ్రీకాళహస్తి మండలంలో జరుగుతున్న పరిశీలన మరో రెండు రోజుల్లో ముగియనున్నట్టు తెలిసింది. శ్రీకాళహస్తి మండలంలో పశువుల మేత బీడుగా రెవిన్యూ రికార్డుల్లో నమోదైవున్న భూములను కూడా ఫ్రీ హోల్డ్ చేసినట్టు తెలిసింది. అలాగే ప్రభుత్వం నుంచి భూములు పొందినవారి చేతుల్లో ఉంటేనే ఫ్రీహోల్డ్ చేయాల్సి ఉన్నా, ఇతరుల చేతుల్లో ఉన్న భూములనూ ఫ్రీహోల్డ్ చేసేసినట్లు గుర్తించారు.అప్పటి అధికారులు అన్ని స్థాయుల్లోనూ నేతకు సహకరించారని అంటున్నారు. సమగ్ర నివేదిక వస్తే పూర్తి స్థాయిలో అక్రమాలు వెల్లడి కానున్నాయి.

ఆంధ్రజ్యోతి- తిరుపతి

బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్) సరైన పర్యవేక్షణ లేక పాలన గతి తప్పుతోంది. వివాదాల సుడిలో చిక్కుకున్న బర్డ్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒకరిద్దరు చేసిన తప్పులకు వైద్యులు, కిందిస్థాయి సిబ్బంది విజిలెన్స్ విచారణ ఎదుర్కోవాల్సి రావడంతో విధుల్లోకి వచ్చేందుకు భయపడుతున్నారు. సెలవుపెట్టి వెళ్లిపోతుండడంతో ఓపీలు తగ్గిపోతున్నాయి. ఆపరేషన్లు వాయిదా పడుతున్నాయి.

గతి తప్పిన 'బర్డ్'


ఆరోగ్యమిత్ర డెస్క్ ముందు వేచివున్న వృద్ధ జంట

- వైద్యులు లేక పడిపోయిన ఓపీలు
- గత అక్రమాలపై కొనసాగుతున్న విచారణ

ఒకప్పటి బర్డ్‌లా లేదు

350 పడకల సామర్థ్యం కలిగిన బర్డ్‌కు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రోజూ సుమారు 700మందికి పైగా అవుట్ పేషెంట్లు వైద్య సేవల కోసం వస్తుంటారు. రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు ఆధునిక వసతులున్నాయి. ఆరు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లలో రోజుకు 25 వరకు శస్త్ర చికిత్సలు జరిగేవి. ప్రస్తుతం ఆపరేషన్ల సంఖ్య పదికిలోపే పడిపోయింది. ఒకప్పుడు బర్డ్‌లో ఓపీ తీసుకోవాలంటే ఉదయం ఐదు గంటలకే చేరుకోవాలి. వారంతో పనిలేకుండా ఆ స్థాయిలో రద్దీ ఉండేది. మధ్యలో ఏదైనా సెలవు వస్తే తర్వాత రోజు రెట్టింపు రోగులు వచ్చేవారు. గడిచిన ఐదేళ్లుగా పరిస్థితి మారిపోయింది. టీటీడీ నిధులతో నిర్వహించే ఆస్పత్రిని కమర్షియల్‌గా మార్చడంతో సహజంగా పేదరోగుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఆగస్టు 15నుంచి వరుసగా నాలుగు రోజులపాటు బర్డ్‌లో ఓపీలు చూడలేదని తెలిసింది. స్వాతంత్ర్య దినోత్సవంతోపాటు ఒక రోజు ఆదివారం రావడం, మధ్యలో శ్రావణశుక్రవారం, మెడికో మృతికి నిరసనగా వైద్యం బంద్ చేసి మొత్తం నాలుగు రోజులు ఓపీలు లేకుండా చేశారు. టీటీడీ సంస్థల్లో బంద్ నిర్వహించకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో నిరసన పేరుతో ఓపీకి సెలవు ప్రకటించేశారు. దీనిపై టీటీడీ విజిలెన్స్ విచారణ కూడా చేసినట్టు తెలిసింది. ఇక అసలు విషయానికి వస్తే నాలుగు రోజుల సెలవుల తర్వాత వచ్చిన సోమవారం ఓపీ హాలు కిక్కిరిసిపోవాలి. కానీ ఆ రోజు కూడా ఓపీ హాలు ఖాళీగా కనిపించింది. ఇద్దరు ముగ్గురు వైద్యులు మాత్రమే వారి చాంబర్‌లో ఉంటే వందలోపు మాత్రమే రోగులు కనిపించారు. వారు కూడా రోజుకు 20 మందికిపైగా ఓపీ చూడలేమని తేల్చి చెప్పేసినట్టు తెలిసింది. ఇక ఆరోగ్యమిత్ర డెస్క్ వద్ద గంటపాటు ఎవరూ కనిపించలేదు. ఎన్టీఆర్ వైద్యసేవ కోసం వచ్చిన ఓ వృద్ధ జంట డెస్క్ ముందు నిల్చొని విసిగిపోయి పక్కకు వెళ్లిపోవడం కనిపించింది. సెక్యూరిటీ సిబ్బంది స్మార్ట్ ఫోన్‌లో రీల్స్ చూసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. నాలుగైదు బెడ్లు కలిగిన ప్లాస్టర్ గదిలో ఇద్దరు సిబ్బంది పనిలేక పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.ఎవరెవరు వస్తున్నారో? ఎప్పుడొస్తున్నారో? పట్టించుకునే పరిస్థితి కనిపించలేదు.పూర్తిస్థాయి డైరెక్టర్ బర్డ్‌లో అందుబాటులో ఉంటే సిబ్బందికి కూడా జవాబుదారీతనం ఉంటుంది. పాలనాపరమైన వ్యవహారాలతోపాటు రోగులకు మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుంది. ఆ దిశగా టీటీడీ ఉన్నతాధికారులు దృష్టిపెట్టాల్సి ఉంది.

పర్చేజ్ కమిటీ సభ్యులకు మెమోలు


బర్డ్‌లో విజిలెన్స్ విచారణ కూడా కొనసాగింది. మాజీ ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి బాగోతాలను ఒక్కొక్కటిగా బయటకు లాగుతున్నారు. అదేవిధంగా ఆయన నేతృత్వంలో ఏర్పాటైన పర్చేజ్ కమిటీ సభ్యులు డాక్టర్ దీపక్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రామ్మూర్తిలతో పాటు ఆఫీస్ సూపరింటెండెంట్ మల్లీశ్వరికి విజిలెన్స్ అధికారులు మెమోలు ఇచ్చినట్టు తెలిసింది. సీటీ స్కాన్ కొనుగోలుకు టెండర్లు ఎలా పిలిచారు? ఇంప్లాంట్లు సరఫరా చేసే కంపెనీలను ఏ ప్రాతిపదికన తీసుకున్నారు? ఆపరేషన్ చేసే వైద్యుల ఇష్టానుసారం పలానా కంపెనీ ఇంప్లాంట్ రోగికి అమర్చారా? లేదా రెడ్డెప్పరెడ్డి సూచించినవే వినియోగించారా? వంటి అంశాలపై ఆరా తీస్తున్నట్టు తెలిసింది. అది కూడా విజిలెన్స్ అధికారులు రూపొందించిన ప్రశ్నల ఫార్మాట్‌ను మెమోలతోపాటు ఇచ్చి వాటిని పూరించాలని చెప్పినట్టు సమాచారం. అయితే కొన్ని మెడికల్ సాంకేతిక అంశాలపై లోతుగా విచారణ చేసేందుకు విజిలెన్స్ సిబ్బంది తటపటాయిస్తున్నట్టుగా తెలుస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి విచారణ ఏదైనా వస్తే పూర్తిస్థాయి అవగాహన ఉన్న సీనియర్ వైద్యులను ముందుగానే టీటీడీ అనుబంధ ఆస్పత్రులకు రెడ్డెప్పరెడ్డి బదిలీ చేయించినట్టుగా చెబుతున్నారు. అలాంటి వాళ్లగురించి తెలుసుకుని విచారిస్తే విజిలెన్స్ అధికారులకు మరింత సమాచారం దొరికే అవకాశం ఉంటుంది.

మెడికల్ షాపు కూడా మూతే

బర్డ్‌లో జనరిక్ బ్రాండెడ్ ఫార్మసీని ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వంలో టీటీడీ నిర్ణయం తీసుకుంది. బర్డ్‌కు అనుబంధంగా ఉన్న మెడికల్ షాపుతోనే జనరిక్ మెడికల్ షాపు నిర్వహించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. 20 శాతం ఆదాయంతో రోగులకు మందులను సరఫరా చేస్తారు. ఇందులో వచ్చిన ఆదాయంలో చెరిసగం పంచుకునేలా ఒకే బ్రాండెడ్ మందులు జన ఔషధి మెడికల్ షాపులో అందుబాటులో ఉంటాయి. దీనికి సంబంధించిన పూర్తి సాఫ్ట్‌వేర్‌ను కూడా బర్డ్ తీసుకొచ్చింది. బర్డ్ కొత్త భవనం కిందనే జనరిక్ మెడికల్ షాపును పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేశారు. అయితే అది మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఆ తర్వాత ఓపెన్ టెండర్ ద్వారా మెడికల్ షాపు కేటాయించినప్పటికీ బర్డ్ ఉన్నతాధికారికి, నిర్వాహకులకు లావాదేవీల్లో తేడా రావడంతో ప్రస్తుతం ఆ షాపు కూడా మూసివేశారు. ఇప్పుడు బర్డ్‌లో ఎలాంటి మెడికల్ షాపు లేకపోవడంతో రోగులు మందుల కోసం చీటీలు పట్టుకుని తిరుగుతున్నారు.

పట్టించుకోండి సారూ

టీటీడీ నిర్వహణలో ఉన్న బర్డ్ ఆస్పత్రి పాలనను పట్టించుకోకుండా అధికార యంత్రాంగం గాలికొదిలేసిందన్న విమర్శలు వస్తున్నాయి. ఉన్న ఒక్క ఆర్ఎంవో కూడా దీర్ఘకాలిక సెలవుపెట్టి వెళ్లిపోతున్నారు. ఆరకొర సీనియర్ వైద్యులకు కూడా అక్కడ విలువలేదని తెలుస్తోంది. దీంతో వారు కూడా అసంతృప్తితో విధులు నిర్వహించే పరిస్థితి. విద్య, వైద్యానికి మాత్రమే ఉండే టీటీడీ జేఈవో గౌతమి బర్డ్‌వైపు వెళ్లడంలేదన్న విమర్శలున్నాయి. ఇక ఇంచార్జి డైరెక్టర్‌గా ఉన్న మరో జేఈవో వీరబ్రహ్మం పరిస్థితి అలాగే తయారైంది.ఈవో ప్రత్యేక దృష్టి పెడితే తప్ప తలా, తోక లేని పక్షిగా మారిన బర్డ్ ఆస్పత్రి పూర్వ వైభవం సంతరించుకోదు.



డైరెక్టర్ గదికి తాళం - ఖాళీగా దర్శనమిస్తున్న ఓపీ హాలు

ఎస్బీఐ ఏటీఎం దొంగల అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 3: ఎస్బీఐ ఏటీఎంల నుంచి రూ. 39.53 లక్షలు కాజేసిన ఘటనలో కస్టోడియన్ కొంగర్ల సురేష్ బాబుతోపాటు నెల్లూరు జిల్లా బుజబుజ నెల్లూరుకు చెందిన క్యాష్ వ్యాన్ డ్రైవర్ మనోజ్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు కథనం మేరకు... తిరుపతిలోని కట్టకింద కొత్తపల్లికి చెందిన సురేష్ బాబు సెక్యూర్ వ్యాల్యూ ఇండియా లిమిటెడ్ సంస్థ ద్వారా ఎస్బీఐ పరిధిలోని 22 ఏటీఎంలకు కస్టోడియన్‌గా పనిచేస్తున్నాడు.ఇటీవల బెట్టింగ్‌లకు అలవాటు పడి భారీస్థాయిలో నష్టపోయాడు. దీంతో ఏటీఎంల నుంచి డబ్బులు కాజేయడానికి పథకం పన్నాడు.తిరుపతిలోని గిరిపురం, ఎల్.ఎస్.నగర్, కె.టి. రోడ్డులో ఉన్న మాన్యువల్ ఏటీఎంల నుంచి దశలవారీగా రూ.40 లక్షలనగదు కాజేశాడు.ఇంతలో ఎస్బీఐ ఏటీఎంలకు ఆడిట్ జరగబోతుందని తెలుసుకున్న సురేష్ బాబు మెల్లగా ఆ మూడు ఏటీఎంలలో అపహరించిన డబ్బును సరిచేసుకోవడం కోసం చంద్రగిరి ఏటీఎంలో వుంచడానికి ఇచ్చిన డబ్బును కాజేసి ఆ మూడు ఏటీఎంలలో సర్దాలనుకున్నాడు.ఈ నేపథ్యంలో ముత్తూట్ ఫైనాన్స్‌లో పరిచయమైన మనోజ్‌కు గతనెల 30వ తేది రాత్రి సెక్యూరిటీ గార్డు వేషం వెయించి, చేతికి గ్లౌజులు, ముకానికి మాస్క్ వేసి చంద్రగిరి ఏటీఎంలో దొంగతనం చేయించాడు.ఈ విషయం తెలుసుకున్న సెక్యూర్ వ్యాల్యూ ఇండియా లిమిటెడ్ సంస్థ ప్రతినిధి ఎస్బీఐ చీఫ్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు చంద్రగిరి సీఐ రామయ్య కేసు నమోదుచేశారు. చంద్రగిరి ఎస్బీఐ ఏటీఎంలో నగదు అపహరణ కేసుకు సంబంధించి సమీపంలో ఉన్న పవిత్ర క్యాంటీన్ సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు.అక్కడ కన్పించిన మారుతి కారు నెంబరు ఆధారంగా ముందుకెళ్లారు.ఏఎస్పీలు రవి మనోహరాచారి, వెంకట్రావు, నాగభూషణరావు, డీఎస్పీలు రమణకుమార్, నరసింగప్ప, చంద్రగిరి ఎస్ఐ రామయ్య నాలుగు రోజులుగా వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు.చంద్రగిరి మండలం గాదంకి టోల్‌గేట్ సమీపంలోని రాధే హోటల్ వద్ద సురేష్‌బాబును, మనోజ్‌ను అరెస్టు చేశారు. వారి వద్దనుంచి ఓ మారుతి కారుతోపాటు రిఫ్రిజిరేటర్, 2 సెల్ ఫోన్లు, 4 ఎస్బీఐ ఏటీఎం క్యాసెట్లు, యమహా స్కూటీ, రూ. 8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు

ఎస్ఐ రవిబాబు సస్పెన్షన్



తడ, సెప్టెంబరు 3: సూళ్లూరుపేటలో గత ఏడాది అక్టోబరు వరకు ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న రవిబాబుపై సస్పెన్షన్ వేటు పడింది.సూళ్లూరుపేట నుంచి రవిబాబు ఓజిలికి బదిలీ అయ్యాక వీఆర్‌కు పంపారు. అయితే సూళ్లూరుపేట ఎస్ఐగా ఉన్నప్పుడు జరిగిన అవకతవకలపై ఇప్పుడు చర్యలు తీసుకున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు మారణాయుధాలతో దాడి చేశారు. టీడీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలవడంతో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఆ తరువాత వైసీపీ నాయకులు కల్పించుకోవడంతో కేసు నీరుగారిపోయింది.చివరకు ప్రత్యక్ష సాక్షులను సైతం తారుమారు చేసి కేసును తప్పుదోవ పట్టించారు. ఘటన జరిగిన ప్రదేశంలో దాడికి ఉపయోగించిన వస్తువులను సైతం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపకుండా దర్యాప్తును నిర్లక్ష్యం చేశారు.దీనిపై అప్పట్లో పోలీసులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా ఈ కేసుకు సంబంధించిన ఆరోపణలపై ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేకంగా దృష్టి సారించి అంతర్గత విచారణ జరిపారు. ఇందులో అప్పట్లో ఎస్ఐగా పనిచేసిన పి.రవిబాబు నిర్లక్ష్యం బయటపడడంతో పాటు నిందితుల పేర్లను అనధికారికంగా తొలగించారని విచారణలో నిర్ధారణ కావడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలు జారీ చేశారు.

కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డుల సస్పెన్షన్

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 3 : గాజుల మండ్యం స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె. బాలాజీతో పాటు ఇద్దరు హోంగార్డులపై సస్పెన్షన్ వేటు పడింది.చైనా దేశీయుడికి వీసా గడువు పూర్తయినా ఇక్కడే నివాసముండడంపై 2021లో రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదుచేశారు.అయితే చైనీయుడికి సహాయం చేస్తానంటూ బాలాజీ అతడి వద్ద నుంచి రూ. 2లక్షలు తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. దీంతో అతడిని సస్పెండ్ చేస్తూ ఎస్పీ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు గిరి ఇసుక, కంకర రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని విచారణలో నిరూపణ కావడంతో అతడిని సస్పెండ్ చేశారు.అలిపిరి స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు రాజ్‌కుమార్ ఇతరుల మొబైల్ ఫోన్ల నుంచి ఉన్నతాధికారులకు తోటి సిబ్బందిపై లేనిపోని ఆరోపణలు చేస్తుండడం గమనించి అతడిని సస్పెండ్ చేశారు. వీరిపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు.

మోదీ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయి

సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి


ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ నాయకుల నిరసన

సూళ్లూరుపేట, సెప్టెంబరు 3: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర లేక రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో పెరిగిన ధరలు, గిట్టుబాటు ధరలపై ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ... పదేళ్ల మోదీ పాలనలో రికార్డు స్థాయిలో నిత్యావసర ధరలు, రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరిచారన్నారు. సామన్యులు జీవ నం సాగించలేని పరిస్థితిలో ఉంటే దేశం వెలిగిపోతుందని ప్రగల్భాలు పలు కుతున్నారని విమర్శించారు. ఎం.పార్థసారథి, సుధాకర్ రెడ్డి, ఆనంద్, సత్యవేడు నియోజకవర్గ సీపీఐ నాయకుడు చిన్నిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడితో ఓజిలి నేతల భేటీ


నాయకులతో నరసింహయాదవ్ పిచ్చాపాటీ

ఓజిలి, సెప్టెంబరు 3: మండలంలో పార్టీ పూర్వ వైభవం సంతరించుకునేలా నాయకులు పనిచేయాలని తిరుపతి జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ పిలుపునిచ్చారు. నాయుడుపేట పట్టణంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన్ను జి.మధుసూధన్‌రెడ్డి, కె.గోపాల్‌రెడ్డి, బి.రవీంద్రారెడ్డి, కె.ఫణీంద్రారెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలసి మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలతోపాటు ఓజిలి మండలం పార్టీ పరిస్థితులను ఆయన అడిగి తెలుసుకున్నారు. పార్టీని బలోపేతం చేసేలా కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా నరసింహయాదవ్ సూచించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం కూడా పాల్గొన్నారు.

త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలి


మరమ్మతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు, సెప్టెంబరు 3: పట్టణానికి తాగునీరు అందించే పైపులైన్ల మరమ్మ తులను త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని వేములపాళెం సమీపంలో జరుగుతున్న తాగునీటి సరఫరా పైపులైన్ మరమ్మతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో పట్టణవాసులకు తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. పనులను వేగవంతంగా పనులను పూర్తిచేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్ ప్రారంభం


ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న నాయకులు

వాకాడు, సెప్టెంబరు 3: మండలంలోని కొండూరు సచివా లయం పరిధిలో ఉన్న హెల్త్ క్లినిక్ సెంటర్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు అభిమానులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. శ్రీసిటీలో పనిచేస్తున్న తీరప్రాంత వాసుల సౌకర్యార్థం తూపిలిపాళెం, కొండూరు, వయా తూపిలి, వాకాడు, చిట్టమూరు మీదుగా శ్రీసిటీకి వెళ్లే బస్సును ఎమ్మెల్యే ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు డి.మధు సూదన్‌రెడ్డి, ఎస్.విజయశేఖర్‌రెడ్డి, పి.పురుషోత్తమరెడ్డి, కె.నందగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు: విజయశ్రీ


ఎస్ఎంసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న విజయశ్రీ

నాయుడుపేట, సెప్టెంబరు 3: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎస్ఎంసీ కమిటీల అభినందన సభ ను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎస్ఎంసీ కార్యవర్గం పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ మాట్లాడుతూ... విద్యాకమిటీలతో పాఠశాలల్లో వసతుల కల్పన మెరుగుపడుతుందన్నారు. అనంతరం ఎస్ఎంసీ చైర్మన్లను సన్మానించారు. నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసా రత్నం, ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, టి.సుధాకర్‌రెడ్డి, పళణి, సెల్వం, ఎం.రాజశేఖర్, రఫి తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రయాణికుడిపై కేసు

ఏర్పేడు, సెప్టెంబరు 2: తిరుపతి విమానాశ్రయం నుంచి సోమవారం ఉదయం బయలుదేరిన ఓ విమానం టేకాఫ్ సమయంలో డోర్ తెరుచుకోవడంతో ఆగిపోయింది. మహారాష్ట్ర పూణేకు చెందిన ప్రయాణికుడు మయూర్ దిలీప్ హోలే(28) డోర్ వద్ద స్విచ్‌ను తాకడంతో అది తెరుచుకుని టేకాఫ్ కాలేదు. దీంతో ప్రయాణికులను విమానాశ్రయ అధికారులు మరో విమానంలో ఎక్కించి పంపారు. స్విచ్‌ను తాకిన ప్రయాణికుడిపై సోమవారం సాయంత్రం ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మయూర్ దిలీప్ హోలేను విచారించిన సీఐ జయచంద్రం మంగళవారం కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో గర్భిణి మృతి


దీపిక మృతదేహం

వాకాడు, సెప్టెంబరు 3: కడుపునొప్పితో గర్భిణి మృతి చెందింది. మండలంలోని నెల్లిపుడికి చెందిన మస్తాన్ భార్య దీపిక (24) ఆరు నెలల గర్భిణి. సోమవారం రాత్రి 10.30 గంటలకు కడుపునొప్పిగా ఉందని భర్తకు చెప్పడంతో కోట పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆరోగ్యం కదుట పడడంతో నెల్లిపుడికి చేరుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు మళ్లీ నొప్పి తిరగతోడడంతో ఆమెను వాకాడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు సుమారు గంటకు పైగా వైద్యం అందించినప్పటికీ దీపిక మృతి చెందింది. దీంతో వైద్యసిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అలాగే సమాచారం అందుకున్న దీపిక కుటుంబసభ్యులు సంఘటనా స్థలికి చేరుకొని విగతజీవిగా పడి ఉన్న తమ బిడ్డను చూసి కన్నీరుమున్నీరయ్యారు. ప్రతిరోజు తమతో ఫోన్‌లో మాట్లాడేదని, సోమవారం ఫోన్ చేయలేదని చెప్పారు. తమ బిడ్డ మృతిపై అనుమానాలున్నాయంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ నాగబాబు మాట్లాడుతూ... పోస్టుమార్టం నివేదిక వచ్చాక వివరాలు తెలుస్తాయని చెప్పారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

కోట, సెప్టెంబరు 3: ప్రభుత్వం పొదుపు సంఘాల ఆర్థికాభివృద్ధి కోసం పవేశపెడుతున్న పథకాలు, రాయితీలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఏపీఎం రత్నయ్య శ్రీనిధి మేనేజర్ జయకుమార్‌ను కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సంక్షేమ పథకాల తీరుతెన్నులపై మంగళవారం వీవోఏలు, సీసీలతో ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా రత్నయ్య, జయకుమార్ మాట్లాడుతూ... 2024-25 ఆర్థిక సంవత్సరానికి శ్రీనిధి రుణాలు విరివిగా రానున్నాయన్నారు. 2023-24లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి మలివిడత పొందాలన్నారు. ఈ సమావేశంలో సీసీలు కృష్ణమ్మ, శ్రీకాంత్, శంకర్, ప్రసాద్, భాస్కర్, బిందు తదితరులు పాల్గొన్నారు.

సహకారానికి ఊపిరి

- కూటమి ప్రభుత్వంతో సొసైటీలకు జవసత్వాలు
- నిర్వీర్యం చేసిన గత వైసీపీ ప్రభుత్వం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 3: సహకార స్ఫూర్తిని దెబ్బతీసింది నాటి వైసీపీ సర్కారు. రైతులకు సేవలందించాల్సిన సొసైటీలను రాజకీయ వేదికలుగా మార్చేసింది. ఆ దెబ్బకు జిల్లాలో సింహభాగం వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్) నిర్వీర్యమైపోయాయి. వీటి దిశను మార్చడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రత్యేకంగా చొరవ తీసుకొని ప్రతి సంఘం రైతులకు ఉపయోగ పడే ఎరువుల వ్యాపారం చేయాలని నిర్దేశించింది. ఇందులో భాగంగా కేంద్రప్రభుత్వం ఎరువుల విక్రయానికి అగ్రికల్చర్ డిప్లొమా అర్హత తప్పనిసరి చేసింది. ఈ నేపథ్యంలో సొసైటీలోని ఉద్యోగులకు రెండు వారాలపాటు స్వల్పకాలిక శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటికే తొలి దశ బృందాలకు శిక్షణ పూర్తయ్యింది. వీరి పేరుతో లైసెన్సులు తీసుకోవడానికి చర్యలు మొదలయ్యాయి. జిల్లాలో ఉన్న 60 పీఏసీఎస్‌లలో ఎరువుల వ్యాపారం ప్రారంభించడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. మార్క్‌ఫెడ్, సెంట్రల్ బ్యాంకు, సహకార, వ్యవసాయశాఖలు సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వం ఆశించిన ఫలితాలు తొందరలోనే సాకారమవడం ఖాయం.


దామా నెల్లూరు సొసైటీ

నాడు పనికిరాకుండా..

జిల్లాలో 60 పీఏసీఎస్‌లు ఉండగా ఇందులో 25నుంచి 30 సొసైటీలు మాత్రమే ఎరువుల వ్యాపారం చేస్తున్నాయి. గతంలో ఈ సంఖ్య 50 వరకు ఉండేది. గత వైసీపీ ప్రభుత్వ చర్యలతో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, రుణాలకు అందించాల్సిన పీఏసీఎస్‌లు నిర్వీర్యమైనాయి. నోడల్ ఏజెన్సీ మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాకు వచ్చిన ఎరువుల్లో 50 శాతం కూడా సరఫరా చేయలేకపోయాయి. రైతుల నుంచి డిపాజిట్ల స్వీకరణ, ఎరువుల వ్యాపారానికి అవసరమైన బ్యాంకు గ్యారంటీలను పొందడం, గోదాములను సిద్ధంగా ఉంచుకోవడం వంటి అంశాలను గాలికొదిలేసింది నాటి వైసీపీ సర్కార్. ఆ సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా ఆ పార్టీ నాయకులనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించడంతో సూళ్లూరుపేట, తడ, నాయుడుపేటల్లోసింహభాగం పీఏసీఎస్‌లు అచేతనంగా మిగిలిపోయాయి.

రైతులపై భారం లేకుండా...

సొసైటీల ద్వారా ఎరువులు, పురుగుమందులు పంపిణీ చేస్తే రైతులపై భారం తుగ్గుతుంది. పీఏసీఎస్‌ల ద్వారా పంపిణీ చేసే ఎరువులకు రవాణా చార్జీలు కంపెనీలే చెల్లిస్తాయి. సహకార సంఘాలకు ఆయా కంపెనీలు ఎమ్మార్పీకే నేరుగా ఎరువులను సరఫరా చేస్తాయి. అదే ప్రైవేట్ వ్యాపారులకైతే రవాణా చార్జీలు చెల్లించవు. కాకినాడ, కృష్ణపట్నం, గుంటూరు దూర ప్రాంతాల నుంచి ఎరువులు వస్తే బస్తాపై దాదాపు రూ.50 నుంచి రూ.70 వరకు అదనంగా రవాణా భారం పడుతోంది ఈ మొత్తాన్ని వ్యాపారులు రైతుల నుంచే వసూలు చేసేవారు. అదే సొసైటీల నుంచి రవాణా అయితే రైతులకు అదనపు భారం పడదు.

నేడు దువ్వూరు ఆత్మీయ సమావేశం

వైసీపీ అసమ్మతి నాయకులకు ఆహ్వానం ● సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల దారేటో?

తడ, సెప్టెంబరు 3: సూళ్లూరుపేట వైసీపీకి దెబ్బమీద దెబ్బ తగలనుంది. ఇప్పటికే పార్టీకి రాజీనామా చేసిన చెంగాళమ్మ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి వెంట పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ మేరకు బుధవారం దొరవారిసత్రం మండలం మైలాంగంలో ఆత్మీయ సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేసి 2014, 2019 ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన తనకు అవమానాలే ఎదురయ్యాయని భావించిన బాలచంద్రారెడ్డి ఆ పార్టీకి తన సత్తా చూపించాలనే ఉబలాటంతో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇక్కడే పార్టీ మార్పుపై ప్రకటన చేయనున్నట్లు సమాచారం. సూళ్లూరుపేట, దొరవారిసత్రం, నాయుడుపేట, తడ, పెళ్లకూరు మండలాల నుంచి వైసీపీ నాయకులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పలువురు సర్పంచులు ఈ సమావేశానికి హాజరుకానున్నట్లుగా సమాచారం.

టీడీపీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్?

మరో వైపు దువ్వూరు చేరికకు టీడీపీ అధిష్ఠానం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టు సమాచారం. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, మంత్రి లోకేశ్ సమక్షంలో ఆయన పార్టీలో చేరుతారంటూ ప్రచారం జరుగుతోంది. ఆయన సతీమణికి చెంగాళమ్మ దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్‌తోపాటు పార్టీలో సముచితస్థానం కల్పించనున్నట్లు సమాచారం.

దబ్బల... దారేటు!

ఇక దువ్వూరు వర్గంగా కొనసాగిన సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. దువ్వూరు బాలచంద్రారెడ్డి వర్గంగా చెప్పుకునే దబ్బల మాత్రం వైసీపీని వీడడం లేదంటున్నారు. అలాగని ఎన్నికల తరువాత జరిగిన పార్టీ కార్యక్రమాలు, వైఎస్ జయంతి వేడుకలకు, వర్ధంతి కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉండటంతో దబ్బల దారేటూ అంటూ చర్చలు జరుగుతున్నాయి.

మేరిగ ఆరోపణలు... దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది

ఎమ్మెల్సీ మురళీధర్‌పై మండిపడ్డ టీడీపీ శ్రేణులు

గూడూరు, సెప్టెంబరు 3: మూడు పార్టీలు మారి పదవులు అనుభవిస్తున్న ఎమ్మెల్సీ మురళీధర్ లాంటి వాళ్లు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌ను విమర్శించడంపై టీడీపీ నాయకులు మండిపడ్డారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌పై ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ చేసిన ఆరోపణలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయన్నారు. దివంగత సీఎం వైఎస్ వర్ధంతి సందర్భంగా వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ... ఎమ్మెల్యే పాశంపై చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ టీడీపీతోనే రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్.భాస్కర్‌రెడ్డి, పి.శ్రీనివాసులు, బి.చెంచు రామయ్య, వి.శివకుమార్, అబ్దుల్‌రహీం, జహంగీర్, ఇశ్రాయిల్‌కుమార్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. తెలుగుయువత నాయకులు ప్రణీత్, వెంకటేష్, సునీల్ ఆధ్వర్యంలో, టీడీపీ ఎస్సీసెల్ నాయకులు కోటేశ్వరరావు, పెంచలయ్య, రమణయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు.

మేరిగకు ఆ స్థాయి లేదు...

చిల్లకూరు: ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్సీ మురళీధర్‌కు లేదని టీడీపీ మండల అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లు రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జ్యోతివే బ్రిడ్జి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంలో స్థానికేతరులకు సిలికా భూములను అప్పగించి అక్రమ రవాణా చేపట్టిన వారు అనుచిత వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో జి.లీలావతి, ఎన్.చిరంజీవి, ప్రవీణ్‌రెడ్డి, కుమార్‌యాదవ్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు చిత్తుగా ఓడించినా బుద్ధి రాలేదా...

చిట్టమూరు: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించినా ఆ పార్టీ నాయకులకు బుద్ధి రాలేదని టీడీపీ నాయకులు అన్నారు. మంగళవారం చిట్టమూరు టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు జి.కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌పై వైసీపీ ఎమ్మెల్సీ మురళి చేసిన అనుచితమైన వాఖ్యలపై మండిపడ్డారు. వైకామా పార్టీకి విధేయుడిగా ఉంటూ దళితులకు అన్యాయం చేస్తోంది మీరు కాదా అని ప్రశ్నించారు. సునీల్‌కుమార్‌కు బెంజి కారు తెలుసని, గంజి మెతుకులు తెలిసిన నాయకుడన్నారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కె.సునీల్ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ ఐటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరికృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చిన్నారావు, చెంచురామయ్య ఆచారి, గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోట: కడిగిన ముత్యంలాంటి ఎమ్మెల్యే పాశం సునీల్‌పై ఎమ్మెల్సీ మేరిగ మురళి వ్యాఖ్యలు స్థాయికి మించినవి అని ఇకనైన నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే ప్రజలు తిరగబడతారని టీడీపీ నాయకులు హెచ్చరించారు. కోటలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు ఎం.సర్వోత్తమరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ హయాంలో ఖనిజాలను, ఇసుకను దోచుకున్నది వైసీపీ నేతలు కాదా అన్నారు. దళిత సామాజిక వర్గంలో నిజాయితీగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌పై మేరిగ మురళి చేస్తున్న వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని టీడీపీ ఎస్సీసెల్ నాయకులు టి.మురళి, చెంగల్రావు, మర్రి పోలయ్య అన్నారు.

వాకాడు: ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు టీడీపీ నాయకులు మండిపడ్డారు. స్వర్ణముఖి గెస్ట్‌హౌస్‌లో జరిగిన మీడియా సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక, మట్టి పేరుతో కోట్లు సంపాదించింది ఆ పార్టీ నాయకులన్నారు. తమ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేదల పక్షపాతి అని, ప్రజలకు అనుక్షణం అందుబాటులో ఉంటున్నారన్నారు. టి.రమణయ్య, భజగేంద్ర, కుంచం దయాకర్, టి.మోహన్‌నాయుడు, ఎస్.విజయశేఖర్‌రెడ్డి, టి.శ్రీనివాసులురెడ్డి, దోశకాయల కృష్ణమూర్తి, పి.అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ విధులకు రెవెన్యూ అధికారులు


గన్నవరం ఎయిర్‌పోర్టులో విధుల్లో ఆర్డీవో చంద్రముని

తడ, సెప్టెంబరు 3: విజయవాడలో వరద సాయానికి సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ అధికారులను నియమించారు. సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, తడ తహసీల్దారు శరత్‌బాబు, నాయుడుపేట డిప్యూటీ తహసీల్దారు రాజేంద్ర తదితర రెవెన్యూ అధికారుల బృందానికి గన్నవరం ఎయిర్‌పోర్టులో విధులు కేటాయించారు. అక్కడికి వచ్చే హెలికాప్టర్లల్లో ఆహార పదార్థాలను నింపేలా విధులు కేటాయించడంతో మంగళవారం నుంచి ఆ విధులు నిర్వహిస్తున్నారు.

పూడిలో స్థలాలు కేటాయించండి

ఎమ్మెల్యేకు ఇరకం గ్రామస్తుల వినతి



తడ, సెప్టెంబరు 3: తమకు పూడికుప్పంలో ఇళ్ల స్థలాలను కేటాయించాలని ఎమ్మెల్యే విజయశ్రీకి ఇరకం కుప్పంవాసులు విన్న వించారు. మంగళవారం సూళ్లూరుపేటలోని ఎమ్మెల్యే నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతి చేశారు. ముఖ్యంగా తమ పిల్లలు చదువుల కోసం పడవలో ఇతరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, అలాగే తమకు ఏ అవసరం ఉన్నా పడవలోనే ప్రయాణించాల్సి ఉందని తెలిపారు. అందుకోసం తామంతా ఆ గ్రామం వదిలి పూడికుప్పంలో నివాసం ఉండేలా తమకు నివాస స్థలాలు అక్కడ కేటాయించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే విజయశ్రీ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆమెను గ్రామస్తులు సత్కరించారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటాం

కోట, సెప్టెంబరు 3 : ఆటో కార్మికులకు అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని సీపీఐ నాయకుడు సీహెచ్ ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, నారాయణ, భాస్కర్ చెప్పారు. మండలంలోని విద్యానగర్‌లో మంగళవారం కోట, విద్యానగర్ ప్రాంతాలకు చెందిన ఆటో డ్రైవర్లతో నాయకులు సమావేశమయ్యారు. సంక్షేమ పథకాలు, బీమా రాయితీలపై అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్ అసోసియేషన్ నాయకులు శేషయ్య, శ్రీనాథ్, గిరి, నాగేంద్ర, నజీర్, రాజు, అనిల్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ అభిమానుల ఉదారత

వాకాడు, సెప్టెంబరు 3 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యా సామగ్రిని ఎన్ఆర్ఐ అన్నమేటి బాలసుబ్రహ్మణ్యం సహకారంతో బాలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు శివకుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్యానీ, నవీన్, సాయి, అజయ్, లోకేష్‌లు పాల్గొన్నారు.

బిట్రగుంట ఫాస్ట్ ప్యాసింజర్‌కు నాయుడుపేటలో స్టాపింగ్

నాయుడుపేట, సెప్టెంబరు 3: నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో బిట్రగుంట నుంచి చెన్నైకు వెళ్లే ఫాస్ట్ ప్యాసింజర్ స్టాపింగ్‌ను పునరుద్ధరించినట్టు సదరన్ రైల్వే అడ్వైజరీ కమిటీ సభ్యుడు చిగురాకుల సురేంద్ర తెలిపారు. బిట్రగుంట ఫాస్ట్ ప్యాసింజర్ నాయుడుపేటలో ఉదయం 6.45 గంటలకు, చెన్నై నుంచి నాయుడుపేటకు సాయంత్రం 6.30 గంటలకు నిలుస్తుందని తెలిపారు.

ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు

గూడూరు అర్బన్/ చిల్లకూరు/తడ, సెప్టెంబరు 3: గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణం సహా మండలంలోని ఉపాధ్యాయులకు క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు సనత్‌కుమార్, కాంచన మాట్లాడుతూ... ఉపాధ్యాయ వృత్తి సమాజంలో గౌరవప్రదమైనదన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది గురువులేనన్నారు. ఈ పోటీల్లో విజేతకలకు ఉపాధ్యాయ దినోత్సవం నాడు బహుమతులు అందిస్తామన్నారు. చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఈవోలు సనత్‌కుమార్, రఫూఫ్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు క్రీడాపోటీ లను నిర్వహించారు. హెచ్ఎం జాన్ పీటర్, పీడీ శ్రీనివాసులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తడ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ క్రీడల్లో మండల పరిధిలోని అన్ని పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంఈవో మల్లికార్జున్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

కోట, సెప్టెంబరు 3: మండలంలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయుల సేవలను పరిగణలోకి తీసుకొని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశామని ఎంఈవోలు శైలజ, మస్తానయ్య చెప్పారు. నాగరాజు (సిద్ధవరం), శ్యామల (తిన్నెలపూడి), ప్రసాద్ (కోట), మంజుల (తిమ్మానాయుడుపాళెం), శ్రీనివాసులు (వంజివాక), షహతాజ్ బేగం (ఉత్తమనెల్లూరు), వెంకటరావు (కోట మెయిన్) ఎంపికైనట్లు ఎంఈవోలు తెలిపారు.

అద్దెలపై విచారణ

కోట, సెప్టెంబరు 3: పట్టణంలో దుకాణాల అద్దెలపై మంగళవారం కోట, వాకాడు మండలాల ఎంపీడీవోలు భవానీ, మనోహర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్ విచారించారు. కోట పంచాయతీకి 25 దుకాణాల అద్దెల వివరాలకు సంబంధించి సమీప దుకాణాల అద్దెలపై అధికార బృందం విచారించింది. పంచాయతీ దుకాణాలకు తక్కువ అద్దెలు చెల్లిస్తున్నారన్న ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అధికారుల బృందం ఈ విచారణ జరిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 3: స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో మంగళవారం రమేష్ దాతృత్వంతో పేదలకు దుస్తులు, ఆహారపొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో కె.చంద్రశేఖర్, జి.చంద్రశేఖర్, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ ప్రతిమల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ఓజిలి, సెప్టెంబరు 3: వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు ప్రజలు సహకరించాలని ఓజిలి ఎస్ఐ స్వప్న కోరారు. ప్రభుత్వ అనుమతి లేకుండా గణేశ ప్రతిమలు ఏర్పాటు చేయకూడదని ఆమె తెలిపారు. కమిటీలు బాధ్యతగా వ్యవహరించి, ఉత్సవాల ప్రారంభం నుంచి ముగింపు వరకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సి ఉందన్నారు.

ముందస్తు జాగ్రత్త చర్యలు


పుచ్చలపల్లి పొర్లుకట్టలను పరిశీలిస్తున్న తహసీల్దారు

కోట, సెప్టెంబరు 3: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంగళవారం తహసీల్దారు జయజయరావు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ మేరకు పుచ్చలపల్లి వద్ద స్వర్ణముఖినదికి పడిన గండ్లను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని జల వనరుల శాఖ అధికారులు కోరారు. అదే విధంగా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు.

గూడూరులో కుండపోత


కోనేటిమిట్టలో పారుతున్న నీరు

గూడూరు, సెప్టెంబరు 3: పట్టణంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఈదురు గాలులు వీచాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అరగంట కురిసిన వర్షం కారణంగా ఐసీఎస్‌రోడ్డు, కుమ్మరవీధి, త్యాగరాజవీధి, శాంతినగర్ అండర్‌బ్రిడ్జి, మాళవ్యానగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు పారింది. దీంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. వర్షం తగ్గిన తరువాత విద్యుత్ సరఫరాను పునరిద్ధరించారు.

ముందు వెళ్తున్న లారీని ఢీ కొన్న మరో లారీ

- ఒకరికి తీవ్ర గాయాలు


డ్రైవర్‌ను వెలుపలికి తీస్తున్న పోలీసులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 3: నాయుడుపేట - పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీ కొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం తెల్లవారు జామున కర్ణాటక నుంచి జార్ఖండ్‌కు సామగ్రి లోడ్‌తో వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న లారీని ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వెనుక వైపు ఢీ కొన్న లారీ డ్రైవర్ సద్దాం అన్సారీ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని క్రేన్ సాయంతో డ్రైవర్‌ను వెలుపలికి తీసి నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

తడ, సెప్టెంబరు 3: చోరీ కేసులో పోలీసులు ఒకరిని అరెస్టు చేశారు. స్థానిక బీసీకాలనీలో నివాసం ఉంటున్న చెంచురత్నం కుటుంబసభ్యులు రాత్రి వేళల్లో తాళాలు వేసి ఇంటిపై నిద్రిస్తుంటారు. గత నెల 19వ తేదీ ఇలాగే ఇంటిపై నిద్రపోయారు. ఉదయం వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుకు సంబంధించి పృథ్వీ ఈ చోరీకి పాల్పడినట్లుగా పోలీసులు గుర్తించి మంగళవారం అతనిని అరెస్టు చేశారు. 44 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు.

బీమా చెక్కు అందజేత



కోట, సెప్టెంబరు 3: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం వంజివాకకు చెందిన కె.పవిత్రకు రూ.4లక్షల చెక్కును కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి అందజేశారు. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి హర్షిత్‌కుమార్ 2023లో జరిగిన ప్రమాదంలో మరణించాడు. కళాశాల యాజమాన్యం యాక్సిస్ బ్యాంక్‌లో గ్రూపు పర్సనల్ యాక్సిడెంటల్ పాలసీని చేసి ఉంది. విద్యార్థి మృతి తరువాత ఆ పాలసీ క్లెయిమ్ అవడంతో రూ.4 లక్షల చెక్కును హర్షిత్‌కుమార్ తల్లి పవిత్రకు అందజేశారు.

రక్తదాన శిబిరం



సూళ్లూరుపేట, సెప్టెంబరు 3: సూళ్లూరుపేట వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం జరిగింది. అంతర్జాతీయ వాసవి వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాల, నారాయణ పాఠశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 72 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ శబరీష్, రీజనల్ చైర్మన్ సాయిరాం, జిల్లా ప్రభుత్వ వైద్యశాల బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి సందీప్ శ్రీనివాస్, సూళ్లూరుపేట ప్రభుత్వ బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి దాక్షాయణి, ప్రతిభ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

క్రీడా మ్యాట్ల అందజేత



నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 3: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని ఏపీ జూడో అసోసియేషన్ అధ్యక్షుడు చైర్మన్ ఆదవరం నాగూరయ్య అన్నారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు రూ.4 లక్షల విలువైన క్రీడా మ్యాట్లను నాగూరయ్య మంగళవారం అందజేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దాదాపీర్, రాజు, శైలజ, అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

గూడూరు, సెప్టెంబరు 3: రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న తమకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 2019 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం నిబంధనల మేరకు తమను ఉద్యోగులుగా నియమించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకువచ్చి, మద్యం దుకాణాలను ప్రైవేటీకరిస్తే తమకు ఉద్యోగ భద్రత ఉండదన్నారు.